

మా కలం - సామాన్యుడి బలం
# నంది పత్రిక
GSTIN 37AMRPM5719R1ZX
జాతీయ తెలుగు దిన పత్రిక
RNI-APTEL/2023/88162

**కర్ణాటకలో 'వందేమాతరం' వివాదం.. డీకే శివకుమార్ ప్రభుత్వానికి గవర్నర్ వార్నింగ్**



ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | No: KNL/3-77(D)/2026-2028 | సంచిక : 256 | బుధవారం 23 - 09 -2026 | పేజీలు : 12 | వెల-3



# కృష్ణమ్మకు హారతి

కుప్పం జలదరింత

ప్రతి చెరువుకూ నీరందించడమే లక్ష్యం

418 చెరువులకు నీరందించే ప్రణాళిక

రూ.439.64 కోట్లతో సమగ్ర ప్రతిపాదన

గతేడాది 133 చెరువులకు నీరు

సాగు, తాగునీటికి శాశ్వత భరోసా

సీఎం సీబీఎన్ ప్రణామం

కృష్ణాజలాలతో కుప్పం ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. హంద్రీ నీవా సుజల స్రవంతి నుంచి కుప్పం బ్రాంచి కెనాల్‌కు చేరిన కృష్ణాజలాలకు మంగళవారం శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లి వద్ద ముఖ్యమంత్రి జలహారతి ఇచ్చారు. కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, పూలు సమర్పించి, కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కుప్పం ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కృష్ణాజలాల రాకతో సాగు, తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం దిశగా కీలక ముందడుగు పడిందని చంద్రబాబు పేర్కొన్నారు. కుప్పం అభివృద్ధిలో నీటి వనరుల పెంపునకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని, నీరు అందుబాటులో ఉంటే వ్యవసాయం,

2లో

# టీచర్లపై దాడులు చేస్తే.. వదిలేది లేదు



**టీడీపీ కార్యకర్తగానే ఇక్కడికి వచ్చా**

**ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణలో మంత్రి నారా లోకేష్**

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి స్వర్గీయ పరిటాల రవీంద్రల సిద్ధాంతాలే పార్టీకి శ్రీరామరక్ష అని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాలను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విచ్చేసిన మంత్రి లోకేష్‌కు పార్టీ శ్రేణులు, స్థానిక ప్రజలు భారీ ఎత్తున గజమాలలు, పూలవర్షంతో ఘన నీరాజనం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో నారా లోకేష్ ప్రసంగించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూడ తాను ఇక్కడికి ముఖ్యమంత్రి కుమారుడిగా, ఎన్టీఆర్ మనవడిగా, బాలకృష్ణ అల్లుడిగా రాలేదని, ఒక తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా వచ్చానని అన్నారు. ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు, సంస్కరణలు అమలు చేశారని పేర్కొన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, పటేల్-పట్వారీ వ్యవస్థ రద్దు వంటి అనేక కార్యక్రమాలను ఎన్టీఆర్ చేపట్టారని గుర్తుచేశారు.

# పిఠాపురంలో రూ.1,500 కోట్ల అభివృద్ధి పండుగ

చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకున్న పవన్ కల్యాణ్

కొత్తగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హాలు పనులను పరిశీలించిన పవన్

నాగులపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం



కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండో రోజు విస్తృతంగా పర్యటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుతో పాటు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు రూ.1,500 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి, సంక్షేమ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పర్యటనలో భాగంగా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని శ్రీ సీతారామస్వామి వారిని దర్శించుకుని, ఏకాదశి వ్రతాచరణ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాభివృద్ధికి కేటాయించిన రూ.90 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన రథశాల, యాగశాల, కాలక్షేప మండపం, అన్నదాన హాలు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం యు.కొత్తపల్లి మండలంలో రూ.9.59 కోట్లతో పునరుద్ధరించిన నాగులపల్లి సమగ్ర రక్షిత మంచినీటి పథకాన్ని ప్రారంభించి, 52 ఆవాసాలలోని సుమారు 97 వేల మంది ప్రజలకు స్వచ్ఛమైన

# వాయుగుండం ఎఫెక్ట్..

## హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు

ఏపీపై వాయుగుండం ప్రభావం..

పలు జిల్లాలకు వర్ష సూచన

శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు

భారీ వర్షాల హెచ్చరిక

ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం

చేసిన హోంమంత్రి అనిత



# గురువులపై దాడి..
## వైసీపీ దుర్మార్గానికి పరాకాష్ఠ: పల్లా

ఉపాధ్యాయులపై దాడులు

దుర్మార్గమన్న పల్లా శ్రీనివాసరావు

బాధ్యులను ఉపేక్షించొద్దని

ప్రభుత్వానికి విజ్ఞప్తి

డీఎస్సీపై దుష్ప్రచారంతో

అభ్యర్థులను దెబ్బతీసే కుట్ర అని వ్యాఖ్య

స్పోర్ట్స్ కోటా టీచర్లపై ఆరోపణలు

సరికాదన్న పల్లా



# విజయవాడ ఘటనతో సంబంధం లేని 250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు పెట్టారు: అంబటి రాంబాబు

డీఎస్సీ అక్రమాలపై

నిరసన తెలిపిన వారిపై

కేసులు పెట్టారన్న

అంబటి రాంబాబు

ఇది ముమ్మాటికీ

రాజకీయ కక్షసాధింపు

వ్యవహారమే అని విమర్శ

పోలీసులు మఫ్టీలో వచ్చి

వైసీపీ నేతలను

లాక్కెళ్లారని

మండిపాటు



విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టిన వైసీపీ నేతలపై కేసులు పెట్టారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... డీఎస్సీ అక్రమాలపై శాంతియుతంగా నిరసన తెలిపిన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం కావాలనే దాడులు చేయించి, రివర్స్ లో అక్రమ కేసులు బనాయించిందని మండిపడ్డారు. విజయవాడ ఘటనతో ఏమాత్రం సంబంధం లేని 250 మందికి పైగా వైసీపీ నాయకులపై భిన్నమైన తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం ముమ్మాటికీ కక్షసాధింపు రాజకీయమేనని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ల దిశానిర్దేశంలోనే ఈ అక్రమ కేసుల పర్వం నడుస్తోందని అంబటి రాంబాబు విమర్శించారు.

**జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట**



మహిళను లైంగికంగా

వేధించారనే ఆరోపణలు

ఇప్పటికే సీఐపై సస్పెన్షన్

వేటు వేసిన ప్రభుత్వం

శ్రీనివాసులు రెడ్డిని

అరెస్ట్ చేయవద్దన్న

సుప్రీంకోర్టు

**స్థానిక ఎన్నికల్లో 94 శాతానికి పైగా గెలవాలి..**



ఎన్నికలకు ఇప్పటినుంచే సిద్ధం

కావాలని సూచన

టీడీపీకి కోటి ఆరు లక్షల మంది

సభ్యులున్నారని వెల్లడి

జనసేన, బీజేపీతో కలిసి ముందుకు

సాగాలని సూచన

కూటమిలో సమన్వయం చర్చలతో

పరిష్కరించుకోవాలని పిలుపు

కష్టపడే కార్యకర్తలను గుర్తించి

గౌరవిస్తామన్న లోకేశ్

# కృష్ణమ్మకు హారతి

పరిశ్రమలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతాయని తెలిపారు. గత ఏడాది కుప్పం బ్రాంచి కెనాల్ ద్వారా కృష్ణాజలాలను తీసుకువచ్చి 133 చెరువులను నింపగలిగామని సీఎం వివరించారు. ఈసారి నియోజకవర్గంలోని సాధ్యమైన ప్రతి చిన్న నీటివనరును కృష్ణాజలాలతో నింపి కుప్పాన్ని మరింత సస్యశ్యామలం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.హంద్రీనీవా కుప్పం బ్రాంచి కెనాల్ పుంగనూరు బ్రాంచి కెనాల్‌లో 207.800 కిలోమీటర్ వద్ద ప్రారంభమై 131.200 కిలోమీటర్ల మేర కొనసాగుతూ కుప్పం సమీపంలోని పరమసముద్రం చెరువు వద్ద ముగుస్తుందని చెప్పారు. ఎత్తిపోతలతో పాటు గురుత్వాకర్షణ ఆధారంగా పనిచేసే ఈ కాలువలో 3 ఎత్తిపోతల కేంద్రాలు, 48 నీటి విడుదల మార్గాలు ఉన్నాయని తెలిపారు.తొలుత పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోని 110 చిన్న నీటిపారుదల చెరువులకు నీరందించడంతో పాటు 6,300 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేలా కుప్పం బ్రాంచి కెనాల్‌ను రూపొందించినట్లు సీఎం వివరించారు. కాలువ ప్రారంభ భాగంలో 216 క్యూసెక్కులు, 3వ ఎత్తిపోతల కేంద్రం తర్వాత చివరి వరకు 161 క్యూసెక్కుల నీటిని తరలించే సామర్థ్యం ఉందన్నారు.202526 నీటి నియంత్రణ సంవత్సరంలో ఆగస్టు 21న పుంగనూరు బ్రాంచి కెనాల్ నుంచి కుప్పం బ్రాంచి కెనాల్‌లోకి నీరు చేరిందని, ఆగస్టు 25న 131.200 కిలోమీటర్ల దూరంలోని పరమసముద్రం చెరువు వరకు కృష్ణాజలాలు చేరాయని తెలిపారు.గత నీటి సంవత్సరంలో లక్ష్యంగా పెట్టుకున్న 110 చెరువులకు మించి 133 చెరువులను పూర్తిగా నింపి 759.21 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని అందించినట్లు సీఎం తెలిపారు. దీంతో 6,965 ఎకరాల ఆయకట్టు ప్రయోజనం పొందిందన్నారు. మరో 29 చిన్న నీటిపారుదల చెరువులకు 46.15 మిలియన్ క్యూబిక్ అడుగుల నీటిని పాక్షికంగా అందించినట్లు వివరించారు.చెరువులు నిండడంతో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం గణనీయంగా మెరుగుపడిందని, సాగు కార్యకలాపాలు కూడా పెరిగాయని చంద్రబాబు పేర్కొన్నారు. రైతులకు నీటి భద్రత కల్పించడంతో పాటు గ్రామాల తాగునీటి అవసరాలను తీర్చేలా హంద్రీనీవా నీటిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో సాధ్యమైన అన్ని చిన్న నీటిపారుదల చెరువులను కుప్పం బ్రాంచి కెనాల్ నీటితో నింపేందుకు సమగ్ర సర్వే నిర్వహించినట్లు సీఎం తెలిపారు. ఈ మేరకు సమగ్ర వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక సిద్ధమైందన్నారు.మొత్తం రూ.439.640 కోట్ల అంచనా వ్యయంతో 418 చిన్న నీటిపారుదల చెరువులకు కృష్ణాజలాలను అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు చంద్రబాబు వెల్లడించారు. ఇందులో గుడుపల్లె మండలంలో 96 చెరువులకు రూ.207.140 కోట్లతో నీరందించడంతో పాటు పారిశ్రామిక ప్రాంత అవసరాల కోసం 200 మిలియన్ క్యూబిక్ అడుగుల నిల్వ సామర్థ్యంతో కలివానక రిజర్వాయర్‌ను ప్రతిపాదించినట్లు తెలిపారు.రామకుప్పం మండలంలో 128 చెరువులకు రూ.101.830 కోట్లతో, శాంతిపురం మండలంలో 87 చెరువులకు రూ.78 కోట్లతో, కుప్పం మండలంలో 107 చెరువులకు రూ.63.570 కోట్లతో నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు వివరించారు.కుప్పం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చెందిన ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. నీటి వనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలను సమాంతరంగా అభివృద్ధి చేస్తూ కుప్పాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. కృష్ణాజలాలు కుప్పం నేలను తడపడం ద్వారా రైతులకు భరోసా, గ్రామాలకు తాగునీటి భద్రత, భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని పేర్కొన్నారు.గుండిశెట్టిపల్లి వద్ద కృష్ణాజలాలకు జలహారతి కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. కార్యక్రమాన్ని తిలకించేందుకు కుప్పం నియోజకవర్గం నుంచి ప్రజలు, రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గ్రామీణ సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రాంతమంతా ఉత్సవ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ విప్‌లు, శాసనమండలి సభ్యులు, చిత్తూరు పార్లమెంటు సభ్యుడు దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి. శ్రీనివాసులు, కుప్పం మున్సిపల్ చైర్మన్ వి. పిళ్లారాత్, కుప్పం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ సభ్యులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తిరుభూషణ్‌కుమార్, జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, అధికారులు, ఇంజనీర్లు హాజరయ్యారు

## పిఠాపురంలో రూ.1,500 కోట్ల అభివృద్ధి పండుగ:

తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. కొండేవారంలో ఇంటింటి కుళాయి కనెక్షన్లను స్వయంగా పరిశీలించారు. ఆర్‌ఆర్ బీహెచ్‌ఆర్ మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న పవన్ కల్యాణ్, స్వయం సహాయక సంఘాలకు రూ.120 కోట్ల రుణాల చెక్కులు, లబ్ధిదారులకు క్రమబద్ధీకరణ ఇళ్ల పట్టాలు, మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు, పదో తరగతి ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. పిఠాపురం పట్టణంలో శాశ్వత డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం, రూ.225 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం, రూ.34 కోట్లతో దేవాలయాల పునరుద్ధరణ, రూ.323 కోట్లతో ఉప్పాడ తీర ప్రాంత రక్షణ గోడ వంటి కీలక ప్రాజెక్టులను వేగవంతం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా రైతులు పవన్ కల్యాణ్‌కు నాగలిని కానుకగా ఇచ్చి తమ కృతజ్ఞతలు తెలిపారు.

## వాయుగుండం ఎఫెక్ట్.. హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు

వాయుగుండం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. నేడు, రేపు శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ఉన్న పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా అక్కడక్కడ మోస్తరు వర్షపాతం నమోదవుతుందని అధికారులు తెలిపారు. వర్షాలతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ హెచ్చరికల నేపథ్యంలో హోంమంత్రి అనిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచి, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. భారీ వర్షాలు, గాలుల కారణంగా ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. చెట్లు, భారీ హోర్డింగ్‌లు, శిథిలావస్థలో ఉన్న భవనాల వద్ద ఎవరూ ఉండవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించి, సురక్షితంగా ఉండాలని కోరారు.

## గురువులపై దాడి.. వైసీపీ దుర్మార్గానికి పరాకాష్ఠ: పల్లా

విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడటం దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై వైసీపీ చేపట్టిన ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతపై ఆయన స్పందించారు. పాఠాలు చెప్పే గురువులపై చేయిచేసుకోవడం హేయమని, బాధ్యులను ఉపేక్షించకూడదని అన్నారు. ఉపాధ్యాయులను అవమానించే రాజకీయాలు మానుకోవాలని సూచించారు.ఉపాధ్యాయులు అంటే గౌరవం లేని వైసీపీ నేతలు ఉద్యోగాలు సాధించిన టీచర్లను అవమానించడంతో పాటు దాడులకు దిగారని పల్లా విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చాటి పతకాలు సాధించి, కష్టపడి చదివి డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారిపై అనుమానాలు రేకెత్తించడం సరికాదన్నారు. స్పోర్ట్స్ కోటా టీచర్లు తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలు, పతకాలు నిజమైనవేనని వెల్లడించినా రాజకీయ రాద్ధాంతం చేయడం దేనికని ప్రశ్నించారు.ఉపాధ్యాయ వృత్తి సాధారణ ఉద్యోగం కాదని పల్లా అన్నారు. ఒక టీచర్ వెనుక ఎన్నో సంవత్సరాల కఠోర శ్రమ, చదువు, పోటీ, కుటుంబం ఆశలు ఉంటాయని చెప్పారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడంతో పాటు వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మార్గదర్శకులుగా గురువులు నిలుస్తారని పేర్కొన్నారు. అలాంటి ఉపాధ్యాయులను రోడ్లపైకి లాగి అవమానించడం, దాడులకు పాల్పడటం సరికాదన్నారు.డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు రాజకీయ రాద్ధాంతంగా మారాయని పల్లా అన్నారు. జగన్‌రెడ్డికి విద్యారంగంపై, ఉపాధ్యాయులపై గౌరవం లేదని విమర్శించారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టిన తీరును ఆయన ప్రస్తావించారు. డీఎస్సీపై ఆరోపణలు ఉంటే ఆధారాలతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి యువతకు ఉద్యోగ భరోసా కల్పించిందని పల్లా తెలిపారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో విద్యారంగంలో సంస్కరణలు చేపడుతున్నామని చెప్పారు. రాజకీయ జోక్యానికి తావులేకుండా పాఠశాలలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధ్యాయుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గురువులపై దాడి చేసిన వారిని గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పల్లా కోరారు. ఇలాంటి ఘటనలను ఉపేక్షించకూడదని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులను కించపరిచే రాజకీయాలు మానుకోవాలని జగన్‌రెడ్డికి హితవు పలికారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్య, ఉద్యోగ రంగాల్లో కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు కొనసాగుతాయని తెలిపారు.

# టీచర్లపై దాడులు చేస్తే..వదిలేది లేదు

1994లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. పరిటాల రవీంద్ర ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రజల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఒకప్పుడు రాయలసీమలో ఫ్యాక్షన్ కారణంగా మహిళలు స్వేచ్ఛగా బయటకు వచ్చే పరిస్థితి కూడా ఉండేది కాదని, అలాంటి పరిస్థితులకు పరిటాల రవీంద్ర అడ్డుకట్ట వేశారని అన్నారు.

**కార్యకర్తల కోసం ప్రాణాలు సైతం లెక్కచేయలేదు:**

తాను నమ్ముకున్న సిద్ధాంతాల కోసం పరిటాల రవీంద్ర ఏనాడూ భయపడలేదని నారా లోకేష్ అన్నారు. 2004 ఎన్నికల్లో టీడీపీ ఓటమి తర్వాత అనేక మంది టీడీపీ కార్యకర్తలు హత్యలకు గురైనా పరిటాల రవీంద్ర వెనుకడుగు వేయలేదని పేర్కొన్నారు. కార్యకర్తలకు అండగా నిలిచేందుకు పార్టీ సమావేశానికి వెళ్లిన ఆయనను అనంతరం దారుణంగా హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిటాల రవీంద్ర మరణం తర్వాత కూడా ఆయన కుటుంబం వెనుకడుగు వేయలేదని అన్నారు. పరిటాల సునీతమ్మ రాజకీయాల్లోకి వచ్చి పార్టీ జెండాను కొనసాగించారని, ఎన్ని బెదిరింపులు ఎదురైనా భయపడలేదని తెలిపారు. ప్రస్తుతం పరిటాల రవీంద్ర తనయుడు పరిటాల శ్రీరామ్ కూడా పార్టీకి అంకితమై కార్యకర్తల కోసం అహర్నిశలు పనిచేస్తున్నారని కొనియాడారు.

**అనంతపురం అభివృద్ధి బాధ్యత నాపై ఉంది:** గత ప్రభుత్వ హయాంలో తన పాదయాత్రను అడ్డుకునేందుకు జీవో తీసుకువచ్చారని నారా లోకేష్ అన్నారు. మైక్ పట్టుకుని తమ గొంతును వినిపించేందుకు కూడా అవకాశం లేకుండా మైకులు లాక్కున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తల ప్రోత్సాహంతో ఎన్ని అడ్డంకులు సృష్టించినా అనంతపురం జిల్లాలో తన పాదయాత్రను కొనసాగించానని తెలిపారు. పాదయాత్రలో అనంతపురం జిల్లా ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా చూశానని అన్నారు. అందుకే దేశంలో ఎక్కడా లేని విధంగా ఫ్లైట్ టెస్టింగ్ కేంద్రాన్ని ఉమ్మడి అనంతపురం జిల్లాకు తీసుకురావడం జరిగిందని తెలిపారు. జిల్లాకు తాగునీరు, సాగునీరు, పరిశ్రమలు తీసుకురావాల్సిన బాధ్యత తనపైనా, ఇక్కడి ప్రజాప్రతినిధులపైనా ఉందన్నారు.తమ కుటుంబాన్ని అనంతపురం జిల్లా ఎంతో ఆదరించిందని నారా లోకేష్ అన్నారు. తన తాత ఎన్టీఆర్‌తో పాటు మామయ్యలు హరికృష్ణ, బాలకృష్ణలను శాసనసభకు పంపించిన ఘనత అనంతపురం జిల్లాదేనని గుర్తుచేశారు. అనంతపురం జిల్లాకు తమ కుటుంబం ఎంత చేసినా ప్రజల రుణం తీర్చుకోలేమని అన్నారు. జిల్లాలో ప్రతి గడపకు సాగునీటితో పాటు తాగునీరు అందించే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని హామీ ఇచ్చారు.

**కూటమి మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలి:**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని నారా లోకేష్ పిలుపునిచ్చారు. కార్యకర్తలు ప్రజల మధ్యకు వెళ్లాలని, ప్రజలను వెతుక్కుంటూ వచ్చే పరిస్థితి కాకుండా ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు కార్యకర్తలే వారి వద్దకు వెళ్లాలని సూచించారు. రాష్ట్రం పక్క రాష్ట్రాలతో పోటీ పడి అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీలు కలిసికట్టుగా పనిచేయాలని అన్నారు. ప్రజల ఆశీస్సులతో ఇప్పటికే 94 శాతం స్థానాల్లో విజయం సాధించామని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పూర్తి స్థాయిలో విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలని పిలుపునిచ్చారు.

**టీచర్ల జోలికి వస్తే దబిడిదిబిడే:** వైసీపీపై నారా లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఉపాధ్యాయులపై దాడులు చేయడం ఏమిటని, జగన్‌కు టీచర్లంటే ఎందుకు అంత కక్ష అని ప్రశ్నించారు. డీఎస్సీ అంశంపై చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని గతంలోనే చెప్పానని అన్నారు. విదేశాలకు వెళ్లేందుకు ఇతరుల మాదిరిగా కోర్టుకు వెళ్లి అనుమతి తీసుకోవాల్సిన అవసరం తమకు లేదని, నీతి నిజాయితీతో పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తమపై పెట్టిన కేసులను దొంగ కేసులుగా సుప్రీంకోర్టు తేల్చిందని ఆయన అన్నారు.

## స్థానిక ఎన్నికల్లో 94 శాతానికి పైగా గెలవాలి..

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతానికి పైగా స్థానాలను కైవసం చేసుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటినుంచే కష్టపడి పనిచేయాలని సూచించారు. అనంతపురం జిల్లా రాప్తాడులో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర విగ్రహాలను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో లోకేశ్ మాట్లాడారు.టీడీపీకి కోటి ఆరు లక్షల మంది సభ్యులు ఉన్నారని లోకేశ్ తెలిపారు. ఇప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ కూడా తమ కుటుంబంలో భాగమయ్యారని, బీజేపీ కూడా కూటమిలో కలిసి పనిచేస్తోందని చెప్పారు. మూడు పార్టీలు కలిసి ఆంధ్రప్రదేశ్‌ను ముందుకు తీసుకెళ్తున్నాయని పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని లోకేశ్ సూచించారు. "ఎన్నికలు.. తగ్గేదేలే" అంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించి గౌరవిస్తామని చెప్పారు. ప్రజల్లో ఉంటూ వారికి సేవ చేయాలని సూచించారు.కూటమిలో ఏవైనా సమస్యలు ఉంటే నాలుగు గోడల మధ్య కూర్చొని చర్చించుకుని పరిష్కరించుకోవాలని లోకేశ్ అన్నారు. ఒకసారి నిర్ణయం తీసుకున్న తర్వాత అందరూ దానికి కట్టుబడి ఉండాలని సూచించారు. మూడు పార్టీలు కలిసికట్టుగా ముందుకు సాగితే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని చెప్పారు. గతంలో పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులను గుర్తుచేసుకున్న లోకేశ్.. వారి కష్టాన్ని ప్రజా సేవ ద్వారా గౌరవించాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 94 శాతానికి మించి స్థానాలు సాధించేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని కోరారు.

## జూబ్లీహిల్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట

మహిళపై లైంగిక వేధింపులు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడి బలవంతంగా అబార్షన్ చేయించారనే తీవ్ర ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన జూబ్లీహిల్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఈ కేసులో తదుపరి విచారణ జరిగే వరకు శ్రీనివాసులు రెడ్డిని అరెస్టు చేయవద్దని, ఆయనపై ఎలాంటి బలవంతపు చట్టపరమైన చర్యలు తీసుకోవద్దని హైదరాబాద్ పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై ఈరోజు సుదీర్ఘ విచారణ చేపట్టింది. బాధితురాలిని లైంగికంగా వేధించారనే ఆరోపణలపై గతంలో తెలంగాణ ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఈ క్రమంలో అరెస్టు నుంచి మినహాయింపు కోరుతూ ముందస్తు బెయిల్ కోసం ఆయన తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఆయన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ శ్రీనివాసుల రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో, సర్వోన్నత న్యాయస్థానం విచారణ చేపట్టి పోలీసులకు రక్షణ ఉత్తర్వులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

## అగ్గి తెగులు నివారణకు చర్యలు

### తిమ్మాపురంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహణ




**మహానంది, సెప్టెంబర్ 22 (నంది పత్రిక):**–వరి పంటలో అగ్గి తెగులు నివారణకు రైతులు సంరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మహానంది మండలం తిమ్మాపురం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ..రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో అధిక తేమ ఉండటం, అధిక మోతాదులో నత్రజని ఎరువులు వినియోగించడం, పంటను అధిక సాంద్రతతో సాగు చేయడం, పొలంలో, గట్లపై కలుపు మొక్కలు ఉండటం, సరైన నీటి యాజమాన్యం పాటించకపోవడం వంటి కారణాల వల్ల అగ్గి తెగులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని ఆయన తెలిపారు.రైతులు తమ పొలాలను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, అగ్గి తెగులు లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అగ్గి తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు ఒక లీటరు నీటికి,ఇసోప్రోథియోలేన్ 1.5 మి.లీ, కాసుగామైసిన్ 2.5 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తక్షణ పోషక యాజమాన్యంలో భాగంగా 19:19:19 నీటిలో కరిగే ఎరువును లీటరు నీటికి 5 నుంచి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు సుభాష్ చంద్రబోస్, భవ్య శ్రీ, రైతులు పాల్గొన్నారు

## 'ఇంత పెద్ద ఆరోపణలు వస్తున్నా ఎందుకు మౌనం?'.. జగన్‌పై అచ్చెన్నాయుడు ఫైర్

మద్యం కుంభకోణం ఆరోపణలపై వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. 2019 ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తామని హామీ ఇచ్చిన జగన్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం వ్యాపారాన్ని ప్రోత్సహించారని విమర్శించారు. ప్రకాశం జిల్లా కొండేపి నియోజకవర్గంలో ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అచ్చెన్నాయుడు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విధానంలో రూ.3,200 కోట్ల మేర అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం సిట్ దర్యాప్తు చేపట్టిందని చెప్పారు. సిట్ దర్యాప్తులో మద్యం విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలపై పలు అంశాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.మాజీ ఏపీఎస్‌బీసీఎల్ ఓఎస్డీ డి.సత్యప్రసాద్ ఏసీబీ కోర్టులో ఇచ్చిన వాంగ్మూలాన్ని అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. మద్యం విధానానికి సంబంధించిన కీలక నిర్ణయాలు అప్పటి ముఖ్యమంత్రి నివాసంలోనే తీసుకున్నట్లు ఆయన వాంగ్మూలంలో పేర్కొన్నారని చెప్పారు. ఈ ఆరోపణలపై జగన్ స్పందించాలని డిమాండ్ చేశారు. సత్యప్రసాద్ గతంలో ప్రభుత్వ వ్యవస్థలో కీలక బాధ్యతల్లో పనిచేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఇప్పుడు ఆయన వాంగ్మూలాన్ని ప్రశ్నించడం సరికాదని అన్నారు.మద్యం సరఫరాలో నగదు లావాదేవీలపై కూడా అచ్చెన్నాయుడు ప్రశ్నలు లేవనెత్తారు. 2019–24 మధ్య మద్యం విక్రయాలు, బ్రాండ్ల ఎంపిక, సరఫరా విధానంలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. మద్యం రవాణా కాంట్రాక్టుల్లోనూ అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. రవాణా టెండర్లలో అవకతవకలతో రాష్ట్ర ఖజానాకు సుమారు రూ.192 కోట్ల నష్టం జరిగిందన్న దర్యాప్తు ఆరోపణలు ఇప్పటికే వెలుగులోకి వచ్చాయి. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఆరోపణలపైనా జగన్ సమాధానం చెప్పాలని అచ్చెన్నాయుడు కోరారు. మద్యం విధానంలో జరిగినట్లు చెబుతున్న అక్రమాలు, నగదు లావాదేవీలు, సరఫరా వ్యవహారాలపై పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. "ఇంత పెద్ద ఆరోపణలు వస్తున్నా ఎందుకు స్పందించడం లేదు?" అంటూ ప్రశ్నించారు.



## విజయవాడ ఘటనతో సంబంధం లేని 250 మందికి పైగా వైసీపీ నేతలపై కేసులు పెట్టారు: అంబటి రాంబాబు



ఘటన సమయంలో విజయవాడలోనే లేని వారిపై కూడా కేసులు పెట్టారని, రాత్రికి రాత్రే నోటీసులు కూడా ఇవ్వకుండా మఫ్టీలో వచ్చి వైసీపీ నాయకులను లాక్కెళ్లడం పోలీసుల దుర్మార్గానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అధికారం శాశ్వతం కాదని, పోలీసు వ్యవస్థను వాడుకుంటూ అన్యాయంగా ప్రవర్తిస్తున్న నారా లోకేశ్, అందుకు సహకరిస్తున్న అధికారులకు రాబోయే రోజుల్లో చట్టం పదునేంటో చూపిస్తామని, న్యాయస్థానాల ద్వారా చట్టపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# టీచర్ల ముసుగులో యువగళం గుండాల దాడి...

# ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే.

**గురువులపై గూండా గిరి, డీఎస్సీ టీచర్లపై వైసీపీ ఉన్మాదుల దాడి అంటూ విషంచిమ్ముతారా?**

**దాడులు చేసి వైయస్సార్ సిపి నేతలపైనే తిరిగి హత్యాయత్నం కేసులతో ప్రజాస్వామ్యం ఖూనీ.**

**తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం.**

**కడప నంది పత్రిక ప్రతినిధి సెప్టెంబర్ 22**ఖాజీపేట: మెగా డీఎస్సీ అక్రమాలకు సమాధానం చెప్పలేక, ప్రశ్నించిన వారిపై ముందుగానే మోహరించిన టీచర్ల ముసుగులోని యువగళం గుండాలతో శాప్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వైఎస్ఆర్సిపి నేతల, నిరుద్యోగుల, దివ్యాంగుల, డీఎస్సీ బాధితులపై పచ్చమూకల దాడులతో ప్రజాస్వామ్యం మంటగలిసిందని... ఇది ప్రజాస్వామ్యంలో బ్లాక్ డే అని వైయస్సార్ సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఖాజీపేట మండలం, దుంపలగట్టులోని ఆయన స్వగృహంలో మంగళవారం ఉదయం రెడ్యం విలేకరులతో మాట్లాడుతూ నారా లోకేష్ గూండాలు, యువగళం రౌడీలు, వైయస్సార్ సిపి నేతలు, కార్యకర్తలు, నిరుద్యోగులపై దాడులు చేసినంత మాత్రాన, అత్యాయత్నం కేసులు అక్రమంగా బనాయించిన మాత్రాన వాస్తవాలు అవాస్తవాలు కావన్న నగ్న సత్యాన్ని గుర్తెరిగి ప్రవర్తించకపోతే కూటమి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని ఆయన హెచ్చరించారు. డీఎస్సీ బాధితులు, విద్యార్థి నాయకులపై టిడిపి యువగళం గూండాలు కర్రలతో దాడి చేసిన వైనం కళ్ళకు కట్టినట్లు స్పష్టంగా కనిపిస్తుతున్నా"గురువులపై గూండా గిరి డిఎస్సీ టీచర్లపై వైసిపి ఉన్మాదుల దాడి" అంటూ ఎల్లో మీడియా లో అసత్య కథనాలు రాసి విషం చిమ్ముతూ రాష్ట్ర ప్రజల్ని... నిరుద్యోగుల్ని పక్కదారి, తప్పుదారి పట్టిస్తున్నారంటూ ఆయన విరుచకుపడ్డారు. టి.డి.పి గుండాలు దాడులు చేసింది కాక తిరిగి వైయస్సార్ సిపి నేతలపై హత్యాయత్నం కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో అక్రమంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిని, గురువుల పేరుతో యువగళం గుండాలను కూటమి ప్రభుత్వం ముందు రోజే విజయవాడకు రప్పించి, వారితో రెచ్చగొట్టేలా అరుపులు, కేకలు, ఈలలు వేయించి, వారితోనే వైయస్సార్ సిపి నేతలపై, నిరుద్యోగులు, దివ్యాంగులపై రాళు వేయించి, కర్రలతో దాడులు చేయించి పైశాచిక ఆనందం పొందుతూ ఎల్లో మీడియాలో వైఎస్ఆర్సిపి పైనే విష, గ్లోబల్ ప్రచారం చేయడం"మొగుణ్ణి కొట్టి మొగసాల ఎక్కినట్లు ఉందని"ఆయన ఎద్దేవ చేశారు. డీఎస్సీలో అక్రమంగా ఉద్యోగాలు పొందిన వారికి సంబంధించి వారి అక్రమాలకు నగ్నంగా, సాక్షాలతో ఆధారాలు చూపిస్తుంటే... మళ్లీ సాక్షాలు చూపించాలంటూ నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ లు మాట్లాడడం ఏమిటని? ఆయన నిలదీశారు. తక్షణం డీఎస్సీ పై సిబిఐ విచారణ చేయాల్సిందేనని... నారా లోకేష్ రాజీనామా చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. వైయస్సార్ సిపి ప్రభుత్వం వచ్చిన వెంటనే... వైయస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే డీఎస్సీ పై విచారణ చేయించి, బాధ్యులైన వారందరినీ శిక్షించి తీరుతామని, జైళ్లకు పంపుతామని... డీఎస్సీలో అక్రమంగా ఉద్యోగాలు కోల్పోయిన వారందరికీ తిరిగి ఉద్యోగాలు ఇచ్చి తీరుతామని రెడ్యం స్పష్టం చేశారు.



## చెన్నూరు యల్లమ్మ తల్లి ఆలయ చోరీ...



యల్లమ్మ తల్లి ఆలయంలో అర్ధరాత్రి చోరీ....ఆలయంలోకి ప్రవేశించిన గుర్తుతెలియని దుండగులుఅమ్మవారి కిరీటం, ముక్కుపుడక, చెవి పోగులు మాయం....సుమారు అర కిలో వెండి ఆభరణాలు అపహరణ...తెల్లవారుజామున ఆలయం తెరిచిన అర్చకులకు చోరీ విషయం వెలుగులోకి...సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలన...కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు... సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా దొంగల కోసం గాలింపు...అమ్మవారి ఆభరణాలు చోరీ కావడంతో భక్తుల్లో ఆందోళన.... ఆలయ భద్రతపై భక్తుల ఆవేదన...

## శింగనమల స్థానిక సంస్థాగత ఎన్నికలకు టీడీపీ వ్యూహరచన సమావేశం

**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 22** శింగనమల నియోజకవర్గ స్థానిక సంస్థాగత ఎన్నికలపై తెలుగుదేశం పార్టీ నాయకులు కీలక సమావేశం నిర్వహించారు. ఎన్నికల సన్నద్ధత, పార్టీ వ్యూహాలు, సమన్వయం వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. అనంతపురంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి శింగనమల నియోజకవర్గ పరిశీలకులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, అనంతపురం జిల్లా స్థానిక సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జ్ ఏరాసు ప్రతాపరెడ్డి, తెలుగుదేశం పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు పూల నాగరాజు హాజరయ్యారు. శింగనమల నియోజకవర్గ సీనియర్ టీడీపీ నాయకులు ఆలం నరసానాయుడు, శ్రీరాం రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొని ఎన్నికల కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## రాష్ట్ర స్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో శాంతినికేతన్, సంకల్ప్ విద్యార్థుల ప్రతిభ

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 22 ( నంది పత్రిక )**ఈ–అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 202526 రాష్ట్ర స్థాయి ఒలింపియాడ్ పరీక్షల్లో శాంతినికేతన్ విద్యాసంస్థలు, సంకల్ప్ స్కూల్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అపుస్మా శాట్ లో 9 మంది, కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్ లో ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి ఘన విజయం అందుకున్నారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకర్లు శ్రీ శాంతినికేతన్ సీబీఎస్ఈ

- ఎస్. హర్షవర్ధన్ 5వ తరగతి స్టేట్ 1వ ర్యాంక్
- బి. భవాజ్ఞ 7వ తరగతి స్టేట్ 3వ ర్యాంక్
- చెరివిత 9వ తరగతి స్టేట్ 3వ ర్యాంక్

**శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, క్రాంతినగర్**

- ఎస్. లోహిత్ నాయక్ 4వ తరగతి స్టేట్ 3వ ర్యాంక్
- ఎన్. కార్తీక్ 8వ తరగతి స్టేట్ 3వ ర్యాంక్
- జేసీ సంతోష్ 9వ తరగతి స్టేట్ 2వ ర్యాంక్

**శాంతినికేతన్ స్కూల్, సంజీవనగర్**

- కే.ఎస్. సానియా 4వ తరగతి స్టేట్ 3వ ర్యాంక్

శ్రీ సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్

- జి. ఐశ్వర్య రెడ్డి 4వ తరగతి స్టేట్ 3వ ర్యాంక్

సంకల్ప్ ఒలింపియాడ్ స్కూల్

- షేక్ శ్రేష్ట 6వ తరగతి స్టేట్ 2వ ర్యాంక్

రాష్ట్ర స్థాయి ర్యాంకర్లు

శ్రీ శాంతినికేతన్ స్కూల్

- ఎన్. కార్తీక్ 8వ తరగతి స్టేట్ 1వ ర్యాంక్
- ఎస్. హరిచరణ్ 10వ తరగతి స్టేట్ 3వ ర్యాంక్ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో పాఠశాల చైర్మన్ సుధాకర్ , ఈ–అభ్యాస్ అకాడమీ ఏపీ సీఈఓ సాయి రామకృష్ణ పాల్గొని విజేతలను అభినందించారు. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలతో పాటు నగదు బహుమతులను అందజేశారు.రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.3,000, ద్వితీయ ర్యాంకర్లకు రూ.2,000, తృతీయ ర్యాంకర్లకు రూ.1,000 చొప్పున నగదు పురస్కారాలు అందించారు. విజేతలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను కూడా శాలువాలతో ఘనంగా సత్కరించారు.ప్రాథమిక స్థాయి నుంచే అందిస్తున్న కాన్సెప్ట్ ఆధారిత బోధన, పటిష్టమైన ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ వల్లే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఈ అద్భుత విజయాలను సాధించగలిగారని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



## డోన్ అభివృద్ధికి రూ.21 కోట్లు

**13.18 కి.మీ. రహదారుల అభివృద్ధి పనులకు శ్రీకారం**



**డోన్, సెప్టెంబర్ 22 నంది పత్రిక** డోన్ పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా రూ.21 కోట్ల అంచనా వ్యయంతో 13.18 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (నూవీ) విధానంలో ఈ పనులు చేపట్టనున్నారు. అలాగే బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలో రూ.17 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కూడా ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా పనులను ప్రారంభించగా, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డోన్ పట్టణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రహదారుల అభివృద్ధితో పట్టణ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయని తెలిపారు. డోన్ నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



## జీవం పోసుకున్న వరి పైర్లు

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 22:** బండి ఆత్మకూరు మండలంలో సోమవారం అర్ధరాత్రి నుండి కుండ పోత వర్షం కురిసింది. 50 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వర్షపాతం నమోదు అయింది. మండలంలో ఈనెల సాధారణ వర్షపాతం 150 మిల్లీమీటర్లు కాగా ఇప్పటికే 105 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం కురిసిన వర్షం కారణంగా భోజనం ,పరమటూరు గ్రామాలలో వేసిన మొక్కజొన్న, మినుము సోయాచిక్కుడు పంటలకు జీవం పోసినట్లు అయ్యింది. ఏ కోడూరు, బి కోడూరు, పార్నపల్లె గ్రామాలలో దాదాపు 15 వందల ఎకరాలలో డ్రై సోయింగ్ విధానంలో సాలు వరి పంటలనువేశారు. ఈ వరి పంటలకు కూడా సోమవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా వరి పంట కు సమృద్ధిగా నీరు లభించినట్లు అయింది. నారాయణపురం లింగాపురం ప్రాంతాలలో రైతులు నెల రోజుల ముందే రబి సీజన్లో వరి సాగుకు పూనుకుంటున్నారని తెలుస్తోంది.



## కరువు సహాయ చర్యలు వెంటనే చేపట్టాలి..

**కరువు మండలాలను వెంటనే ప్రకటించాలి**

**పంట రుణాల రీ షెడ్యూల్, చెల్లింపుల గడువు పొడిగించాలి**

**డిసిసి అధ్యక్షురాలు విజయ జ్యోతి.**



ఎల్ నీనో, వర్షాబావ పరిస్థితులపై సమీక్షలకే పరిమితం కాకుండా తక్షణమే కరువు సహాయ చర్యలు చేపట్టాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు విజయ జ్యోతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ...వైయస్సార్ కడప జిల్లాలో సరాసరి వర్షపాతం 28.8 మిల్లీమీటర్లు కాగా, కలసపాడు మండలంలో అసలు వర్షమే కురవలేదని అన్నారు. కరువు మండలాల ప్రకటనను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రకటించి ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాలని కోరారు. వర్షాభావంతో నష్టపోయిన ఆహార పంటలకు ఎకరాకు ₹25 వేలు, ఉద్యాన వాణిజ్య పంటలకు ఎకరాకు ₹50 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.కౌలు రైతులను గుర్తించి పంటల బీమా, ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వాలని కోరారు. కరువు పరిస్థితుల్లో పంట రుణాల రీ షెడ్యూల్, చెల్లింపుల గడువు, పొడిగింపు వంటి చర్యలు ప్రభుత్వం, బ్యాంకింగ్ వ్యవస్థలు చేపట్టాలని డిమాండ్ చేశారు

## కడప శంకరాపురంలో లలిత హాస్పిటల్ ను సందర్శించిన కడప ఎమ్మెల్యే రెడ్డప్ప మాధవి.



**నంది ప్రతినిధి, సెప్టెంబర్ 22 కడప జిల్లా.** కడప నగరంలోని శంకరాపురం కెనరా బ్యాంక్ ఎదురుగా నూతనంగా ప్రారంభించబడిన లలిత హాస్పిటల్ ను ప్రభుత్వ విప్, కడప సాక్ష్యం సభ్యురాలు రెడ్డప్ప మాధవి రెడ్డి, రెడ్డప్ప శ్రవణ్ రాజ్ రెడ్డి సందర్శించారు. హాస్పిటల్లోని అత్యాధునిక వైద్య పరికరాలు, వార్డులు, తదితర మౌలిక సదుపాయాలను వారు పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ మామిళ్ళ లలితా దేవి, డాక్టర్ పోలంకి భరత్ కుమార్ కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప నగర ప్రజలకు ముఖ్యంగా మహిళలకు అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో కూడిన అత్యాధునిక వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఆసుపత్రి యాజమాన్యానికి వైద్య సిబ్బందికి తమ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య బృందం స్థానిక ముఖ్య నాయకులు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి.

**కమిషనర్ ఎం.జయకృష్ణ.**



**తిరుపతి బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 22 నంది పత్రిక** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ అధికారులు ఆదేశించారు. ప్రజల నుండి అందిన సమస్యలను మంగళవారం కమిషనర్ స్వయంగా పరిశీలించారు. టిడిపి ఇంచార్జి జెబి శ్రీనివాస్, బ్యాంక్ శాంతమ్మ పలువురు మహిళలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా పి.కె. లేఔట్ లో నుండి ప్రజలు, వాహనాలు మెయిన్ రోడ్డులోకి వచ్చేందుకు దారి సౌకర్యం కల్పించాలని కోరారు. కొర్లగుంటలోని పలు వీధుల్లో గుంతల వలన వర్షం పడితే ఇండ్లలోకి నీరు వస్తున్నాయని, ద్విచక్ర వాహనాలు పడిపోతున్నాయని తెలిపారు. రోడ్లు వేసేందుకు, బోర్లు మరమ్మతులు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎవ్వరూ కూడా రోడ్లపైన, కాలువల్లో చెత్త వేయకుండా చూడాలని తెలిపారు. ప్రతిరోజు మా సిబ్బంది వస్తున్నారని వారికి చెత్త ఇవ్వాలని తెలిపారు. నగర పరిశుభ్రతలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వినాయక సాగర్ ను పరిశీలించి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, సర్వేయర్ గురువా రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.




## ఆటో డ్రైవింగ్ లైసెన్స్ పొందిన రెండో మహిళ సారమ్మ

**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ 22** మోటారు వాహన చట్టాలను గౌరవిస్తూ బేతంచెర్లకు చెందిన కొమ్మోజీ మిద్దె సారమ్మ ఆటో నడిపేందుకు డోన్ ఆర్టీఓ కార్యాలయం ద్వారా డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. దీంతో డోన్ ఆర్టీఓ పరిధిలో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ పొందిన రెండో మహిళగా సారమ్మ నిలిచారు. ఇంతకుముందు భారతి తొలి మహిళగా ఆటో డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. లైసెన్స్ లేకుండా ఆటోలు నడుపుతున్న వారు సారమ్మను ఆదర్శంగా తీసుకుని, నిబంధనల ప్రకారం డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని ఆర్టీఓ క్రాంతి కుమార్ కోరుతున్నారు.

నంది పత్రిక

23 బుధవారం సెప్టెంబర్ 2026

## పట్టణాల రూపురేఖలు మార్చేలా రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పోరేషన్లల్లో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు





**రాష్ట్రవ్యాప్తంగా వివిధ మున్సిపాల్టీలు, కార్పోరేషన్లల్లో చేపట్టే అభివృద్ధి పనులను కుప్పం నుంచి వర్చువల్ గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు**

**మౌలిక వసతుల కల్పనలో భాగంగా పట్టణ స్థానిక సంస్థలల్లో రూ.11,359 కోట్ల విలువైన పనులు, 123 మున్సిపాలిటీల్లో రూ.7469 కోట్ల పనులకు శ్రీకారం**

**ఈ కార్యక్రమానికి తిరుపతి నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, నగరపాలక కమీషనర్ జయ కృష్ణ, వివిధ కార్పోరేషన్ చైర్మన్లు, అధికారులు**

**తిరుపతి జిల్లాలో రూ.206 కోట్ల విలువైన పనులను ప్రారంభించిన సీఎం**

**హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ ఏ ఎం) ద్వారా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి శ్రీకారం: జిల్లా కలెక్టర్**

**తిరుపతి, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 22 నంది పత్రిక:** పట్టణాల రూపురేఖలు మార్చేలా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పోరేషన్లల్లో వివిధ అభివృద్ధి పనులను కుప్పం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా పట్టణ స్థానిక సంస్థలల్లో రూ. 11,359 కోట్ల విలువైన పనులకు, 123 మున్సిపాలిటీల్లో రూ. 7469 కోట్ల పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ కార్యక్రమానికి వర్చువల్ విధానంలో శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియం నుండి జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ , మున్సిపల్ కమిషనర్ జయకృష్ణ, టీటిడి బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మి, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, టూరిజం బోర్డు చైర్మన్ నూకసాని బాలాజీ, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, ఎస్ వి బి సి చైర్మన్ శ్రీధర్ వర్మ, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివమ్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వర ప్రసాద్, ఏ పి యూ ఎఫ్ ఐ డి సి డైరెక్టర్ చందన, గంగమ్మ గుడి చైర్మన్ మహేష్ యాదవ్, కూటమి నాయకులు, జె.బి.శ్రీనివాస్, సామంచి శ్రీనివాస్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ హెచ్ ఏ ఎం పనులకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో సుమారు రూ. 5,800 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలో సుమారు రూ. 206 కోట్ల విలువైన పనులు ప్రారంభమవుతున్నాయని, ఒక్క తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోనే రూ. 106 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనుల ద్వారా పట్టణ ప్రాంతాల్లో నాణ్యమైన రహదారుల నిర్మాణం, సెంట్రల్ మీడియన్ల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, స్ట్రీట్ లైటింగ్ తదితర మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశుద్ధ్యం, భద్రతతో పాటు మెరుగైన పట్టణ వాతావరణం అందించడమే ఈ పనుల ప్రధాన లక్ష్యమన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో అభివృద్ధి పనుల అంచనా వ్యయంలో 40 శాతం నిధులను ప్రభుత్వం ముందస్తుగా సమకూర్చగా, మిగిలిన 60 శాతం మొత్తాన్ని కాంట్రాక్టర్ పెట్టుబడిగా సమకూర్చుతారని కలెక్టర్ తెలిపారు. కాంట్రాక్టర్ సమకూర్చిన మొత్తాన్ని ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల మేరకు వడ్డీతో సహా విడతల వారీగా చెల్లించే విధానం అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ప్రభుత్వంపై ఒకేసారి అధిక ఆర్థిక భారం పడకుండా, అవసరమైన పట్టణ మౌలిక వసతుల పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. తద్వారా ప్రజలకు రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర సౌకర్యాలు త్వరితగతిన అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే పనుల అమలు, నిధుల చెల్లింపుల్లో నిర్దేశిత విధానాలను పాటిస్తూ పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, పనులు చేపట్టే కాంట్రాక్టర్లకు కూడా ఆర్థిక భరోసా కల్పించే విధంగా హెచ్ ఏ ఎం విధానం ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సంక్షేమ కార్యక్రమాలను నిరంతరాయంగా అమలు చేస్తూనే, పట్టణ ప్రాంతాల్లో దీర్ఘకాలికంగా అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేసేందుకు కూడా ప్రత్యేక దృష్టి సారిస్తోందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. హెచ్ ఏ ఎం వంటి వినూత్న విధానాల ద్వారా పట్టణాల అభివృద్ధిని వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కమిషనర్ జయకృష్ణ మాట్లాడుతూ తిరుపతి నగరంలో అభివృద్ధి పనులకు 106 కోట్ల రూపాయల పనులు మంజూరు చేశారని తెలిపారు. ఈ నిధులతో నగరంలో రహదారుల నిర్మాణం, సెంట్రల్ మీడియన్ల ఏర్పాటు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధి, స్ట్రీట్ లైటింగ్ తదితర మౌలిక వసతులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అభివృద్ధి పనులను చేస్తున్న తమకు నగర ప్రజలు నగర పరిశుభ్రతలో సహకరించాలని తెలిపారు. స్వచ్ఛ తిరుపతి సాధించేందుకు అందరూ కంకనబద్దులు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛ తిరుపతి సాధనలో అందరూ భాగస్వాములు అవుతామని కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## “63 కోట్లతో నంద్యాల పట్టణ రూపురేఖల్లో సమగ్ర మార్పు

## ప్రజల సహకారంతో నంద్యాలను స్వచ్ఛ, ఆరోగ్యకర పట్టణంగా తీర్చిదిద్దుతాం







### ఎన్ .ఎం.డి.ఫిరోజ్“

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 22 ( నంది పత్రిక )** నంద్యాల జిల్లాలోని పట్టణాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మున్సిపల్ టౌన్ హాల్లో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం ద్వారా నంద్యాల జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల పరిధిలో చేపట్టనున్న రూ. 164 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిరోజ్ మాట్లాడుతూ, హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద నంద్యాల జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలకు మొత్తం రూ. 164 కోట్ల నిధులు కేటాయించడం జరిగిందని నంద్యాల మున్సిపాలిటీకి 63 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. ఈ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయడం సంతోషకరమన్నారు. అందులో భాగంగా నంద్యాల పట్టణానికి రూ. 63 కోట్ల నిధులతో పట్టణంలోని మౌలిక వసతులను మరింత మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పథకం కింద కేటాయించిన రూ. 63 కోట్లతో పాటు అమృత్ 1.0, అమృత్ 2.0, 15వ ఆర్థిక సంఘం నిధులు, మైనారిటీ సంక్షేమ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, బీపీఎస్,ఎల్లారెస్ తదితర నిధులను సమన్వయం చేస్తూ నంద్యాల పట్టణంలో సుమారు రూ. 550 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఫిరోజ్ తెలిపారు. నంద్యాల పట్టణంలో రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, మౌలిక వసతులు తదితర రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేపట్టి పట్టణ రూపురేఖలను మార్చే దిశగా ముందుకు సాగుతున్నామని అన్నారు. ప్రజల సహకారంతో నంద్యాలను స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన మరియు అభివృద్ధి చెందిన పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఫిరోజ్ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్యులు ఫరూక్ సారథ్యంలో నంద్యాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. నంద్యాల జిల్లాలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ , జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా , ఫిరోజ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పరి సురేష్, దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ దూదేకుల దస్తగిరి,డీసీ ఛైర్మెన్ చాబోలు ఇలియాస్, మాజీ రాష్ట్ర కార్యదర్శి జిల్లెల్ల శ్రీరాములు, మహిళా విభాగం అధ్యక్షురాలు విజయ గౌరీ,మాజీ కౌన్సిలర్లు ఖండే శ్యాం సుందర్ లాల్, నాగార్జున, శివ శంకర్ యాదవ్, కృపాకర్ , రవి కుమార్, తెలుగుదేశం పార్టీ క్లస్టర్ మరియు వార్డు ఇంచార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.



## ఏడవ రోజు బండి ఆత్మకూరులో వీఆర్ఏల సమ్మె



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 22:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పైపడుతున్న వీఆర్ఏలకు ఇచ్చిన హామీలు గాలిలోనే ఉన్నాయని వీఆర్ఏలు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేస్తూ బండి ఆత్మకూర్ మండల తాసిల్దార్ కార్యాలయం ఎదుట వీఆర్ఏలు ఏడవ రోజు తమ నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా వీఆర్ఏల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ పెద్దన్న, నంద్యాల జిల్లా అధ్యక్షుడు నారాయణ, బండి ఆత్మకూరు మండల అధ్యక్షుడు బి .శేషు మాట్లాడుతూ తమ సమస్యలను ఎన్నిసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లిన పరిష్కారం కాకపోవడంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందని అన్నారు. తెలంగాణ తరహాలో పే స్కేల్ అమలు చేయాలని అర్హులైన వీఆర్ఏలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పని మాత్రం పెరుగుతుంది జీతం మాత్రం పెరగడం లేదని మండిపడ్డారు. హామీలతో మా కడుపులో నిండవు, మా కుటుంబాలు బతకాలంటే న్యాయమైన వేతనం పదనోతులు కావాలి అంటూ వీఆర్ఏలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. తమ ప్రధానమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. హామీ ఇచ్చారు , అధికారంలోకి వచ్చారు.. రెండేళ్లు గడిచిపోయాయి. కానీ క్యారియర్ సమస్యలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పట్టించుకునే నాధుడే లేదంటూ గ్రామ రెవెన్యూ సహాయకులు అసహాయతను వ్యక్తం చేశారు. మా సమస్యలు ఎప్పుడు పరిష్కారం చేస్తారో చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## టీచర్లపై వైసీపీ మూకల దాడి సిగ్గుచేటు!

### గౌరవించాల్సిన టీచర్ల పై భూతులా?

### ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా



**నంది పత్రిక ఆత్మకూరు..** విజయవాడ లో నిన్న టీచర్ల పై వైస్సార్సీపీ దాడి చేసిన నేపథ్యంలో ఈరోజు టీచర్ల కు సంఘీభావంగా ప్రెస్ నోట్ విడుదల చేయడం జరిగింది. సమాజానికి మార్గదర్శకులుగా గురుదేవోభవ అని నిత్యం గౌరవించాల్సిన ఉపాధ్యాయులపై వైసీపీ గూండాలు భూతులు మాట్లాడుతూ భౌతిక దాడులకు తెగబడటం అత్యంత హేయమైన చర్య అని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నిబంధనల ప్రకారం, స్వచ్ఛంగా ఉద్యోగాలు సాధించుకుని బాధ్యతగా విధి నిర్వహణలో ఉన్నావారిపై ఇలాంటి దాడులేంటని ప్రశ్నించారు. డిఎస్సి నియామకాలు పై చర్చకు రమ్మని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఎన్నిసార్లు బహిరంగంగా పిలిచారని, స్పోర్ట్ కోటా విషయమై చర్చించడానికి రవినాయుడు గారు సిద్ధమని అన్నారని, అయినా చర్చకు రావడానికి మొహం చెల్లక ఇలా గూండాగిరీ చేస్తూ గురువుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తారా అని నిలదీశారు. డీఎస్సిలో నిజంగా అక్రమాలు జరిగాయనుకుంటే వైసీపీ కోర్టుకు వెళ్లి ఎందుకు నిరూపించడం లేదని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కొండంత అండగా నిలుస్తుందని సంఘీభావం తెలియజేశారు. వెంటనే దాడికి పాల్పడిన వైసీపీ గూండాలను అరెస్టు చేసి, ఉపాధ్యాయులకు, ప్రభుత్వ ఉద్యోగులకు పూర్తి భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరారు.

## వీఎల్ఎస్ఐ సాంకేతికత బయోసెన్సర్ డిజైన్‌పై వర్క్‌షాప్ ప్రారంభం

**నంద్యాల, సెప్టెంబర్ 22. నంది పత్రిక:** శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజ్ (అటానమస్), నంద్యాలలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో, ఐ ఈ టి ఈ సహకారంతో “నెక్ట్స్ జనరేషన్ బయో సెన్సార్ డిజైన్ యూజింగ్ వివిఎల్ఎస్ఐ అండ్ ఎమర్జింగ్ అప్లికేషన్స్“అనే అంశంపై వారం రోజుల వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 22 నుంచి 26, 2026 వరకు కళాశాలలోని సెమినార్ హాల్‌లో నిర్వహించబడుతోంది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవి. సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఆధునిక వైద్యరంగంలో వేగవంతమైన, ఖచ్చితమైన ఆరోగ్య నిర్ధారణకు బయోసెన్సర్లు ఎంతో కీలకమైనవి. వివిఎల్ఎస్ఐ సాంకేతికతను బయోసెన్సర్‌లతో అనుసంధానం చేయడం ద్వారా చిన్న పరిమాణంలో, తక్కువ విద్యుత్ వినియోగంతో, వేగవంతమైన సెన్సింగ్ వ్యవస్థలను అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులు ఇటువంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలను నేర్చుకుని, పరిశోధన మరియు ఆవిష్కరణల వైపు ముందుకు సాగాలి” అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వై. మల్లికార్జున రావు మాట్లాడుతూ, “బయోసెన్సర్ టెక్నాలజీ అనేది ఎలక్ట్రానిక్స్, బయోటెక్నాలజీ, వైద్యరంగాల సమన్వయంతో అభివృద్ధి చెందుతున్న అంతరశాస్త్ర సాంకేతికత. వివిఎల్ఎస్ఐ డిజైన్, ఫ్యాబ్రికేషన్ టెక్నిక్స్ మరియు ఎమర్జింగ్ అప్లికేషన్స్‌పై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించడం ఈ వర్క్‌షాప్ ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పరిశ్రమ మరియు పరిశోధన అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి” అని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ మరియు హెడ్ అఫ్ ద డిపార్ట్మెంట్ డాక్టర్ కె శ్రీనివాస రావు వనరుల వ్యక్తిగా వ్యవహరిస్తున్నారు. వర్క్‌షాప్‌లో వివిఎల్ఎస్ఐ డిజైన్ సెన్సార్ట్స్ మరియు ఫ్యాబ్రికేషన్ ప్రాసెస్ వంటి అంశాలపై విద్యార్థులకు నిపుణులచే అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని ఈసీఈ విభాగం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె వినోద్ కుమార్ సమన్వయం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నంది పత్రిక

23 బుధవారం సెప్టెంబర్ 2026

# అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రభుత్వం మాట తప్పింది

**మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి...**

**కూటమి ప్రభుత్వ వైఖరిపై తీవ్ర నిరసన**

**నంద్యాలలో వీఆర్ఏల ఆందోళనకు సంపూర్ణ మద్దతు**

**వైఎస్ జగన్ దృష్టికి సమస్యలు తీసుకెళ్తామని హామీ**

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 22 ( నంది పత్రిక )** ఎన్నికల సమయంలో ప్రజలకు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చి, ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం... అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించడం దారుణమని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మండిపడ్డారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి మాట తప్పిన కూటమి నేతలు, ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చి వీఆర్ఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. నంద్యాల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గత కొద్ది రోజులుగా వీఆర్ఏలు వివిధ డిమాండ్ల సాధన కోసం నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన వీఆర్ఏల దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి సంపూర్ణ మద్దతు మరియు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా శిల్పా రవిరెడ్డి మాట్లాడుతూ...



"అధికారంలోకి రాకముందు ఒక మాట, వచ్చాక మరొక మాట అన్న చందంగా కూటమి నేతల వ్యవహారం ఉంది. ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్ల ఆరు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది" అని విమర్శించారు. వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోసం ఎన్నిసార్లు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం వాటిని బుట్టలో దాఖలు చేస్తోందని ధ్వజమెత్తారు. వీఆర్ఏల న్యాయమైన డిమాండ్ల సాధన పోరాటంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమస్యలన్నింటినీ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, వారి తరపున పోరాటం కొనసాగిస్తామని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి భరోసా కల్పించారు.

## జిల్లా లో ఉద్యాన పంటలను ప్రోత్సహించేలా అన్నీ చర్యలు తీసుకుంటున్నాం...

**జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి.**

**వెలిదండ్ల గ్రామంలో అవకాడో పంటను పరిశీలించిన జిల్లా కలెక్టర్.**



**కడప, బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 22: నంది పత్రిక** పులివెందుల నియోజక వర్గం, లింగాల మండలం, వెలిదండ్ల గ్రామంలో రైతు కర్నా వరదారెడ్డి సాగు చేస్తున్న అవకాడో పంటను మంగళవారం జిల్లా కలెక్టర్ డా శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఈ సందర్భంగా అవకాడో తోటను సందర్శించిన కలెక్టర్, పంట సాగు విధానం, పెట్టుబడి వ్యయం, దిగుబడి, మార్కెట్ ధరలు, రైతుకు లభిస్తున్న ఆదాయం తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు. అవకాడో వంటి అధిక పోషక విలువ కలిగిన ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను సూచించారు. పంట ఎంపిక నుంచి సాగు, నీటి యాజమాన్యం, ఎరువుల వినియోగం, తెగుళ్ల నివారణ, కోత అనంతర నిర్వహణ, మార్కెటింగ్ వరకు రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలను ఉద్యానశాఖ అధికారులు అందించాలని ఆదేశించారు. అలాగే అవకాడో సాగుకు అనుకూలమైన భూములు, నీటి వనరులు ఉన్న ప్రాంతాలను గుర్తించి, ఆసక్తి ఉన్న రైతులకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో అవకాడో సాగును విస్తరించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉద్యాన పంటల ప్రోత్సాహకాలు, రాయితీలు మరియు ఇతర పథకాలపై రైతులకు పూర్తి సమాచారం అందించి, అర్హులైన రైతులు వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వెలిదండ్ల గ్రామంలో అవకాడో సాగు చేస్తున్న రైతు అనుభవాలను ఇతర రైతులకు కూడా తెలియజేసి, జిల్లాలో ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచడంతో పాటు రైతుల ఆదాయాన్ని మెరుగుపరిచే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. పంటకు మార్కెటింగ్ సదుపాయాలు, గిట్టుబాటు ధరలు లభించేలా రైతులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని, పంట ఉత్పత్తిని నాణ్యతా ప్రమాణాలతో మార్కెట్‌కు తీసుకెళ్లే విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్రమన్నేశ్వర రావు, ఉద్యాన శాఖాధికారి హరి ప్రసాద్, డ్వామా పిడి ఆదిశేషారెడ్డి, ఎపిఎంఐపి పిడి శ్రీ రమణ, మాజీ శాసన మండలి సభ్యులు రవీంద్ర నాద్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## 17 కోట్లతో బేతంచెర్ల పట్టణ అభివృద్ధి పనులు.

**వర్చువల్ గా ప్రారంభించిన రాష్ట్ర ముఖ్య మంత్రి.**

**పాల్గొన్న డోన్ ఎంఎల్ఎ కోట్ల- బేతంచెర్ల కమీషనర్.**



**బేతంచెర్ల సెప్టెంబర్ 22 ( నంది పత్రిక ).** డోన్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా బేతంచర్ల నగర పంచాయతీ పరిధిలో 17 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించారు. డోన్ పట్టణంలో జరిగిన ఈ వర్చువల్ కార్యక్రమంలో, డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, మరియు బేతంచెర్ల నగర పంచాయితీ కమీషనర్ డి.హరి ప్రసాద్ గవర్చువల్ విధానంలో పాల్గొని పనులకు శ్రీకారం చుట్టారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఎఎం ) విధానంలో రహదారుల నిర్మాణము తోపాటు బేతంచర్ల పట్టణం మరియు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా డోన్ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తెలిపారు. బేతంచెర్ల పట్టణం ను సమగ్ర అభివృద్ధికి మరో మైలు రాయిగా నిలుస్తుందని ఆయన తెలిపారు.

## పోషక ఆహారంతోనే ఆరోగ్యం పదిలం

**- ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ**



**కొత్తపల్లి - నంది పత్రిక :** పోషక ఆహారంతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ నాగేశ్వరమ్మ అన్నారు మంగళవారం మండలంలోని సింగరాజుపల్లి అంగన్వాడి కేంద్రంలో 9వ జాతీయ పోషణ మహోత్సవాలు నిర్వహించడం జరిగింది,. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు ,బాలింతలు, మరియు ఆరు సంవత్సరాల లోపు చిన్నపిల్లలకి సరైన పోషకాహారం అందకపోవడం వల్ల కలిగే నష్టాలను వివరించారు,. మరియు ప్రతిరోజు తీసుకునే ఆహారంలో, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, మరియు చిరుధాన్యాలతో తీసుకోవడంతోపాటు, మునగాకు, కరివేపాకును, ఆహారంలో ఎక్కువ మోతాదులో ఉపయోగించడం వల్ల రక్తహీనతను దూరం చేయడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని వివరించడం జరిగింది, మరి అంగన్వాడి కేంద్రంలో పోషకాహార స్టాల్ ఏర్పాటు చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి అంగన్వాడి టీచర్ హరిత, హెల్పర్ సుభాషిని, మరియు లబ్ధిదారులు, చంద్రకాంత్, విజయుడు, వర ప్రసాదు, శివారెడ్డి, లక్ష్మీదేవి, త్రివేణి, రత్నమ్మ, పార్వతమ్మలు పాల్గొన్నారు

## అబ్బీపురంలో ఉచిత వైద్య శిబిరం




**మహానంది, సెప్టెంబర్ 22 (నంది పత్రిక):-** మహానంది మండలం అబ్బీపురం గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీడీపీటీ చైతన్య కుమార్ రెడ్డి, ఆదేశాల మేరకు ఎఫ్ఆర్వో మురళీకృష్ణ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ సాయికుమార్ ప్రజలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఎఫ్ఆర్వో మాట్లాడుతూ.. అటవీ శాఖ ఆధ్వర్యంలో అడవిని ఆనుకొని ఉన్న గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో హైమావతి, ఎఫ్ ఎస్ వో లు తేజ, పరమేశ్వరి, ఎఫ్బీవో ప్రతాప్ , ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## లైసెన్స్‌తో రెండవ లేడీ డ్రైవర్.. సారమ్మ ఆదర్శం!

**డోన్ , సెప్టెంబర్ 22 నంది పత్రిక** మోటారు వాహన చట్ట నిబంధనలను పాటిస్తూ బేతంచెర్లకు చెందిన కొమ్మోజీ మిద్దె సారమ్మ ఆటో డ్రైవింగ్ లైసెన్స్ పొందారు. డోన్ ఆర్టీఓ కార్యాలయం పరిధిలో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ పొందిన రెండో మహిళగా ఆమె గుర్తింపు పొందారు. అంతకుముందు భారతి తొలి మహిళగా లైసెన్స్ పొందినట్లు తెలిపారు. మోటారు వాహన చట్టం ప్రకారం ప్రజా రహదారులపై వాహనం నడపాలంటే సంబంధిత వాహన తరగతికి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. లైసెన్స్ లేకుండా లేదా చెల్లుబాటు కాని లైసెన్స్‌తో వాహనం నడిపితే చట్టపరమైన చర్యలు, జరిమానాలకు గురయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సారమ్మ నిబంధనల ప్రకారం లైసెన్స్ పొంది ఆటో నడపడం ద్వారా ఇతర మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. లైసెన్స్ లేకుండా ఆటోలు నడిపేవారు నిబంధనలను పాటించి లైసెన్స్ పొందాలని పలువురు సూచించారు



## కుండ పోతగా వర్షం

**-అయిన పొలాల్లో చుక్కనీరు నిలువని వైనం**

**-మండలంలో 20.4 మి.మీల వర్షపాతం నమోదు**

**-అడప దడప పొలాల్లో వర్షపునీరు దర్శనం**



**కొత్తపల్లి - నంది పత్రిక :** మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కుండపోతగా వర్షం కురిసింది. ఎల్నినో ప్రభావంతో ఇంతవరకు ఒక్క మంచి వర్షం కురువకపోవడంతో భూతాపం ఎక్కువైంది. అయితే ఒక్కసారిగా కుండపోత వర్షం పడినప్పటికి పొలాల్లో చుక్కనీరు నిలువని వైనం నెలకొంది. ఏదో ఒక చోట మాత్రమే పొలాల్లో అక్కడక్కడా వర్షపునీరు దర్శనమిస్తుంది. మండలంలో 20.4 మి.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారుల వెల్లడించారు. ఈ వర్షం కొంత మేర వరి పొలాలకు ఆసర నిస్తుందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన మొక్కజొన్న, పెసర, మినుము ఇతర పంటలకు ఏమి ఉపయోగపడదని మిగిలిన రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదీ ఏమైనా మరోసారి భారీ వర్షాలు కురిస్తేగాని రబీ సీజన్ సాగుకు రైతన్నలు సిద్ధం కాలేరని ప్రజలు బహిరంగంగా చర్చించు కుంటున్నారు. అయితే కుండపోత వర్షానికి గువ్వలకుంట్ల, జి.వీరాపురం, కొత్తపల్లిలో, నందికుంటలోని పలు కాలనీలు, బావాపురం, ఎం. లింగాపురం గ్రామాలలో ఆత్మకూరు-సంగమేశ్వరం ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచి ప్రజలు, ప్రయాణికులు, వాహదారులు। తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



## అధ్వానంగా రహదారి, పట్టించుకోని అధికారులు..!



**మహానంది సెప్టెంబర్ 22 (నంది పత్రిక):-** మహానంది మండలం తిమ్మాపురం గ్రామం నుంచి బుక్కాపురం గ్రామం వరకు రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. రహదారి మధ్యలో ఒకచోట వంతెన రహదారిపై గుంత ఏర్పడి ప్రమాదకరమైన స్థితిలో ఉంది. ఈ రహదారి గుండా నిత్యం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలకు వెళ్లే నిత్యం వందలాదిమంది వాహనాదారులు ,ప్రజలు రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారు. ఏదైనా ప్రమాదం జరగకముందే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు.



# భక్తిశ్రద్ధలతో శ్రీ గంగమ్మ అమ్మవారికి జలాభిషేకం



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 22, నంది పత్రిక** శ్రీ గంగమ్మ అమ్మవారికి 108 బిందెలతో ఎంతో భక్తిశ్రద్ధలతో జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు బాగా కురువాలి అందరూ బాగుండాలి అనే ఉద్దేశంతో అమ్మవారిశాల ఆర్యవైశ్య సంఘం యువజన అధ్యక్షులు గుండా రవికుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆళ్లగడ్డ పట్టణంలోని అమ్మవారిశాల నుండి సత్రంవీధి లోని గంగమ్మ దేవాలయం వరకు 108 కళశాలను మహిళలు తీసుకొని వచ్చి గంగమ్మ అమ్మవారికి జాలాభిషేకం చేశారు. అనంతరం గుండా రవికుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన పెద్దలకు, మిత్రులకు, మహిళా సోదరీమణులకు, ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేస్తున్నానన్నారు. మేము అడిగిన వెంటనే వాటర్ ట్యాంక్‌ను పంపించి పూజకు సహకరించిన మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, వారి సోదరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరూ బాగుండాలి అందులో నేను కూడా ఒకడిగా ఉండాలి అనే ఉద్దేశంతోనే ఎల్లప్పుడూ ముందుకు సాగుతానన్నారు. అందరి మంచినే కోరుకుంటూ, అందరితో కలిసి ముందుకు సాగడమే నాఉద్దేశమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# నగర ఓటర్లు ఏ4,79,861

## కార్పొరేషన్ వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శన

## 2026 జనవరి 1వ తేదీ నాటి ఓటర్లను ప్రామాణికంగా ప్రకటన



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వార్డుల వారీగా ఓటర్ల జాబితాను నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ప్రదర్శించారు. మంగళవారం నగర పాలక కార్యాలయంలో అధికారులతో కలిసి జాబితాను ప్రదర్శించిన కమిషనర్, వార్డుల వారీగా ఓటర్ల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 2026 జనవరి 1వ తేదీని అర్హత తేదీగా తీసుకుని సిద్ధం చేసిన ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ప్రదర్శించినట్లు తెలిపారు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో గతంలో 52 వార్డులు ఉండగా, ఇటీవలే 68 వార్డులుగా పునర్విభజించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నగరంలో 2,32,508 మంది పురుషులు, 2,47,295 మంది మహిళలు, 58 మంది ఇతరులు కలిపి మొత్తం 4,79,861 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించారు. ఓటర్లు తమకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలో ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, డిప్యూటీ సిటి ప్లానర్ షబ్నం శాస్త్రీ, ఏసిపి నాగరాజు, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, సూపరింటెండెంట్ సుబ్బన్న, పాల్గొన్నారు.

## రూ.480 కోట్లతో చేపడుతున్న పులివెందుల తాగునీటి సరఫరా పథకం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.



**కడప బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22: నంది పత్రిక** పులివెందుల ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో రూ.480 కోట్ల అంచనా వ్యయంతో పులివెందుల నియోజక వర్గం, లింగాల మండలం, పార్నపల్లి గ్రామం వద్ద చేపడుతున్న పులివెందుల తాగునీటి సరఫరా పథకం పనులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మంగళవారం పరిశీలించారు. త్వరలో పులివెందుల తాగునీటి సరఫరా పథకంను ప్రారంభించనున్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించి పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పథకంలో చేపడుతున్న వివిధ పనులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, పూర్తికి అవసరమైన చర్యలపై అధికారులతో సమీక్షించారు. పథకం ద్వారా పులివెందుల ప్రాంత ప్రజలకు నిరంతరాయంగా, సురక్షితమైన తాగునీటిని అందించేందుకు అవసరమైన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట ఆర్ డబ్ల్యూఎస్. శాఖ ఎస్.ఈ ఏడుకొండలు, డిపిఓ రామచంద్ర, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, మాజీ శాసన మండలిసభ్యులు శ్రీ రవీంద్రనాథ్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, ప్రాజెక్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...



# ఆదోని పట్టణ అభివృద్ధికి రూ.51 కోట్ల విలువైన పనులకు శ్రీకారం

## టీడీపీ నాయకులు, కార్యకర్తల ర్యాలీ

**ఆదోని నంది పత్రిక ప్రతినిధి:** ఆదోని పట్టణ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. పట్టణాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) ప్రాజెక్టులలో భాగంగా ఆదోని మున్సిపాలిటీకి సుమారు రూ.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న భారీ అభివృద్ధి కార్యక్రమాలకు అనుసంధానంగా ఆదోని పట్టణానికి నిధులు కేటాయించడంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం చేపట్టిన హెచ్ఏఎం ప్రాజెక్టుల వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆదోని నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కార్యక్రమానికి తరలివచ్చారు.

**ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి..** ముందుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు మీనాక్షి నాయుడు నివాసం వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీగా బయలుదేరి ఆదోని మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హెచ్ఏఎం అభివృద్ధి కార్యక్రమాల వర్చువల్ ప్రారంభోత్సవాన్ని వీక్షించారు.



**రాష్ట్రవ్యాప్తంగా రూ.11,360 కోట్ల పనులు..** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పట్టణాల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం సుమారు రూ.11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించినట్లు నాయకులు తెలిపారు. ఇందులో భాగంగా ఆదోని మున్సిపాలిటీకి సుమారు రూ.50 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కొన్ని వివరాల్లో ఈ మొత్తం రూ.51 కోట్లుగా పేర్కొనబడుతున్న నేపథ్యంలో, తుది అధికారిక అంచనాల ప్రకారం పనుల విలువ ఖరారుకానుంది. పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధిలో రహదారులు, పారిశుధ్యం, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఆదోని పట్టణానికి పెద్ద మొత్తంలో అభివృద్ధి నిధులు కేటాయించడం పట్ల టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారంతో పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఇంద్రానగర్ వార్డ్ ఇంచార్జ్ (అడ్వకేట్ )ఐ సి.రామకృష్ణ. వలి,శరభ, రాజేష్, మేస్త్రి రంగన్న తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప అభియాన్‌లో ఉచిత వైద్య శిబిరం



**బద్వేల్, సెప్టెంబర్ 22 (నంది పత్రిక):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవం సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బద్వేల్ మండలం తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతలచెరువు సచివాలయం, అబ్బుషాబుపేటలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తొట్టిగారిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి. రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో గర్భిణీలు, బాలింతలు, బీపీ, షుగర్ తదితర సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్యంపై అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి. వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్ వి. జనార్దన్ రావు, ఏఎన్ఎం వాణిశ్రీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సుస్మిత, అఖిలాభాన్, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృది ధ కూటమితోనే సాధ్యం

## 12వ యూనిట్ కన్వీనర్ మహేష్ యాదవ్



**నంది పత్రిక ఆదోని ప్రతినిధి** రాష్ట్రంలో గ్రామాల అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని 12వ యూనిట్ కన్వీనర్ మహేష్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలలో త్రాగు నీరు, రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం, నూతన వీధిలైట్లు ప్రతి గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సూపర్ సిక్స్ పథకాలకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు.. డోర్ టు డోర్ కార్యక్రమంలో ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని, స్థానిక సంస్థ ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులకు ప్రజలు అండగా నిలుస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు... రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు చేస్తూ అభివృద్ధి బాటలో నడుపుతున్నారని తెలిపారు.. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కూడా కూటమి నాయకులు అఖండ మెజార్టీ సాధిస్తారని, ప్రజలు కూడా అభివృద్ధి వైపు నిలుస్తారని అన్నారు.

## ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే ఫిర్యాదు చేయండి

## జి జి హెచ్ సూపరింటెండెంట్ డా. కే. వెంకటేశ్వర్లు



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సదరం సర్టిఫికెట్ల కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సదరం క్యాంప్‌కు వచ్చే ప్రజలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ కోసం ఆసుపత్రిలో ఎవరికీ లంచం ఇవ్వాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సదరం క్యాంప్‌లో విధులు నిర్వహించే వైద్యులు అందుబాటులో ఉంటారని, సదరం క్యాంప్‌కు సంబంధించిన అన్ని సేవలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచితంగానే అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సదరం క్యాంప్‌లో సేవలు అందించేలా అధికారులు, వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేశామని సూపరింటెండెంట్ డా. కే. వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రజలు మధ్య వర్తులను నమ్మకుండా, ఎలాంటి డబ్బులు చెల్లించకుండా నేరుగా ఆసుపత్రి సిబ్బందిని సంప్రదించి ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తో పాటు ఆర్ ఎం ఓ లు డాక్టర్ వెంకట రమణ , డాక్టర్ సునీల్ ప్రశాంత్ మరియు ఇతర ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మకూరులో వైఎస్ఆర్ సీపీ శంఖారావం.. భారీ జనసందోహం మధ్య ఘనంగా విస్తృత స్థాయి సమావేశం

### భారీగా తరలివచ్చిన వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు..

### కిక్కిరిసిన ఎల్.వి. ఫంక్షన్ హాల్



**నంది పత్రిక ఆత్మకూరు..** ఆత్మకూరు పట్టణంలోని ఎల్.వి. ఫంక్షన్ హాల్‌లో శ్రీశైలం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశం ఘనంగా జరిగింది. శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ఆత్మకూరు పట్టణం, మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావడంతో ఫంక్షన్ హాల్ కిక్కిరిసిపోయింది. పార్టీ శ్రేణుల భారీ హాజరుతో సమావేశ ప్రాంగణం సందడిగా మారింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ భవిష్యత్ కార్యాచరణ, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజా సమస్యలపై నిరంతరంపోరాటంచేయడం, కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వామ్యం చేయడం వంటి అంశాలపై శిల్పా చక్రపాణి రెడ్డి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై శిల్పా చక్రపాణి రెడ్డి ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ నాయకులు, కమిటీ సభ్యులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులను మరింత సమన్వయం చేసుకుంటూ ప్రజలతో మమేకమై పార్టీని బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తున్న ప్రతి నాయకుడు, కార్యకర్తకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత అవకాశం కల్పిస్తామని శిల్పా చక్రపాణి రెడ్డి తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల ఒత్తిళ్లకు, బెదిరింపులకు లేదా అక్రమ కేసులకు కార్యకర్తలు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటాననిధైర్యంచెప్పారు. అధికారులెవరైనాచట్టపరమైన పరిధిని దాటి అన్యాయంగా వ్యవహరిస్తే, చట్టబద్ధమైన మార్గాల్లో న్యాయపోరాటం చేస్తామని శిల్పా చక్రపాణి రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి తో పాటు వైఎస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెల్దుర్తి పట్టణంలోని దోమల నివారణ అరికట్టాలి... సిపిఐ



**కర్నూలు సిటీ నందిపత్రిక** వెల్దుర్తి పట్టణంలోని వాతా వరణ కి అనుగుణంగా దోమల నివారణకు బీజింగ్ పౌడర్.ఫాగింగ్ పొగ ఏర్పాటు చేయాలని పట్టణంలోని టైఫాడు. మలేరియా డెంగు వైరల్ ఫీవర్ లాంటి అనేక రోగాలకు గురవుతారు కాబట్టి ముందు జాగ్రత్తగా పట్టణంలోని ఫాగింగ్ పొగ. బ్లీచింగ్ పౌడర్ వార్డులలో ఏర్పాటు చేయాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారికి రహమత్ భాష కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సిపిఐ వెల్దుర్తి మండల కార్యదర్శి టి కృష్ణ.సిపిఐ పట్టణ కార్యదర్శి గిరిబాబు పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు చిన్న వ్యాపారస్తుల సంఘం నాయకులు అనిల్.సిపిఐ సీనియర్ నాయకులు డి రాజు. రైతు సంఘం నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు

## ‘ఇరాన్‌ను నాశనం చేసేయాలా?’.. ఐరాస వేదికగా ట్రంప్ సంచలన హెచ్చరిక

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి తీవ్ర హెచ్చరికలు చేశారు. తమతో ఒప్పందానికి రాకపోతే ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేసే అవకాశం ఉందంటూ వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో మంగళవారం ప్రసంగించిన ట్రంప్.. ఇరాన్‌కు రెండు మార్గాలే ఉన్నాయని అన్నారు. అమెరికాతో ఒప్పందం చేసుకుని దేశాన్ని తిరిగి నిర్మించుకోవడం లేదా మరిన్న సైనిక చర్యలను ఎదుర్కోవడమని పేర్కొన్నారు. “నేను ఇస్లామిక్ రిపబ్లిక్‌ను త్వరగా నాశనం చేయాలా? వారికి మళ్లీ ప్రాణాలతో బయటపడే అవకాశం లేకుండా చేయాలా?” అని ట్రంప్ ప్రశ్నించారు. అయితే అమెరికా మధ్యంతర ఎన్నికలు ముగిసిన తర్వాత ఇరాన్‌తో ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరాన్ కూడా అమెరికా ఎన్నికల ఫలితాల కోసం వేచి చూస్తోందని చెప్పారు. ఇరాన్‌కు అణ్వాయుధం దక్కకుండా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు.

# నాయుని చెరువును సందర్శించిన డిప్యూటీ డిఎంహెచ్ ఓ






## వైద్య శిబిరం ఏర్పాటు

**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 22:** బండి ఆత్మకూరు మండల పరిధిలో ఈర్నపాడు గ్రామానికి సమీపంలో ఉన్న నాయిని చెరువు చెంచుగూడెంను శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు ఐటీడీఏ, వైద్యబృందం మంగళవారం సాయంత్రం సందర్శించింది. డిప్యూటీ డిఎంహెచ్వో రవి, ప్రోగ్రాం ఆఫీసర్ పరమేశ్వర్ ,ప్రాజెక్టు మేనేజర్ కేజీ నాయక్ తదితరులు నాయుడు చెరువు గూడెంను సందర్శించారు.ఈ సందర్భంగా గిరిజనులు తమ గో డును వెళ్ళబోసుకున్నారు. గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా గూడెం మొత్తం నీట మునిగిందని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న ఇళ్లన్నీ గుడిసెలు కావడంతో వర్షపు నీరు నేరుగా ఇళ్లలోకి రావడంతో వంట చేసుకోవడానికి పడుకోవడానికి కూడా వీలులేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. రాత్రివేళ ఇళ్లలోకి పాములు విషజీవులు వస్తూ ఉండటంతో ప్రాణ భయంతో అల్లాడిపోతున్నామని గిరిజనులు ఐటిడి అధికారులు దృష్టికి తెచ్చారు. గూడెంలో నిలిచిన నీటిని వెంటనే బయటికి తీయించాలని విజ్ఞప్తి చేశారు. తాత్కాలికంగా టార్పాలిన్లు దోమతెరలు ,ఆహారాలు అందించాలని విన్నవించుకున్నారు. గిరిజన గూడెంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి మా ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అయితే గిరిజనులు ఆరోపించినట్లుగా అక్కడ వర్షపు నీళ్ళు నిలువ లేవన్న విషయాన్ని ఐటిడిఏ అధికారులు గుర్తించారు. కాలనీలో రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు కాలువలు కూడా ఏర్పాటు చేస్తామని ఐటిడి ఏ అధికారులు గిరిజనులకు వివరించారు. కాలనీలో ఉన్న బోరు కూడా రిపేరులో ఉందన్న విషయాన్ని అధికారులు గుర్తించారు. బోరును రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని అధికారులు పేర్కొన్నారు. గిరిజన గూడెంలో పరిశుభ్ర వాతావరణం నెలకొల్పేందుకుగాను డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, ఈర్నపాడు పంచాయతీ కార్యదర్శి హసన్, బ్లీచింగ్ పౌడర్ ను చల్లించే కార్యక్రమాన్ని చేపట్టారు.

**గిరిజన గూడెంలో వైద్య శిబిరం** నాయుని చెరువు చెంచుగూడెంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల పరిధిలో ఉన్న నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సమీరా తోపాటు వైద్య సిబ్బంది పాల్గొని గిరిజనులకు వైద్య సేవలను అందించారు. బిపి షుగర్ తో పాటు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు సీజనల్ వ్యాధుల పట్ల ప్రమోత్తగా ఉండాలని పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హేమంత సమీరా ఎంపీహెచ్వో వెంకటరమణ,ల్యాబ్ టెక్నీషియన్ శ్యామసుందర్ ,నాగవేణి ,మోహన్ నాయక్, ఐటిడిఏ ,వెలుగు, వి బి జి రాంజీ శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.



## కర్నూలులో ఘనంగా ప్రారంభమైన గణేష్ నిమజ్జన శోభాయాత్ర.

**రాంబొట్ల దేవాలయంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించి,**
**శోభయాత్రను ప్రారంభించిన**
**మంత్రి టి.జి. భరత్, కలెక్టర్ డా. ఎ. సిరి , ఎస్పీ విక్రాంత్ పాటిల్,**
**పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరితారెడ్డి**
**పాతబస్తీలో కాలినడకన శోభాయాత్ర, భద్రతా ఏర్పాట్లను**
**పర్యవేక్షించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**




**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు నగరంలో వినాయక నిమజ్జన శోభాయాత్ర అత్యంత వైభవంగా ప్రారంభమైంది. మంగళవారం నిమజ్జనోత్సవాల సందర్భంగా మొదటగా నగరంలోని ప్రసిద్ధ రాంబొట్ల దేవాలయ గణపతిని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టి.జి. భరత్, జిల్లా కలెక్టర్. డా. ఎ. సిరి , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, మాజీ ఎమ్మెల్యే ఎస్.వి. మోహన్ రెడ్డి తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాతబస్తీ మీదుగా కొనసాగుతున్న గణేష్ నిమజ్జన శోభాయాత్రను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ కాలినడకన పర్యటించి పరిశీలించారు.

**భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.**వినాయక నిమజ్జనం పూర్తయ్యే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కర్నూల్ ఎస్పీ గారి తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు మధుసూదన్ రావు, కేశవరెడ్డి, మారుతి శంకర్, రామయ్య నాయుడు,ఎస్సై ఖాజావలి తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఏ. పి ని కరువు రాష్ట్రంగా ప్రకటించాలి.

**వెలుగోడు సెప్టెంబర్ 22 నంది పత్రిక:** మండల కేంద్రమైన వెలుగోడులో అఖిల భారత రైతు కూలీ సంఘం పిలుపుమేరకు వెలుగోడు మండల తహసిల్దార్ కార్యాలయం దగ్గర మంగళవారం ధర్నా నిర్వహించారు.డిప్యూటీ తాహసిల్దార్ సుప్రియ డిమాండ్లతో కూడిన వినతి పత్రం ఇచ్చారు. ఈ ధర్నాను ఉద్దేశించి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ రాష్ట్రములో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు కురవాల్సిన సమయంలో వర్షాలు లేకపోవడం అధిక ఉష్ణోగ్రతలు భూగర్భ జలాలు అడుగంటడం చెరువులు, కాలువలు జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవటం వల్ల వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటుంది. ఇప్పటికే రాష్ట్రంలోని అత్యధిక ప్రాంతాల్లో ఖరీఫ్ సాగు దెబ్బతింది. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. పశువులకు మేత ప్రజలకు తాగునీరు కూడా సమస్యగా మారింది.ఎల్ ని నో ప్రభావంతో సెప్టెంబర్ లో కూడా రాష్ట్రంలో చాలా ప్రాంతాల్లో సాధారణ కంటే తక్కువగా వర్షపాతము నమోదు అయింది. ఈ స్థితిలో వర్షాభావం వల్ల పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ ఆర్థిక సాయం అందించాలని , వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించాలని , గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు పశువులకు మేత అందుబాటులో ఉంచాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కావున తక్షణమే రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి చేస్తూ కేంద్ర బృందాలను రాష్ట్రంలో అన్ని జిల్లాలు పరిశీలించే విధంగా చర్యలు తీసుకొని కేంద్ర నిధులు రాబట్టి తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని , ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజుకు 700 రూపాయలు చెల్లించాలని , ప్రైవేట్ ,ప్రభుత్వ బ్యాంకుల రుణాలు రద్దు చేయాలని ఉపాధి కూలీల కుటుంబాలకు తక్షణ సాయం కింద పదివేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆనందరావు, అధ్యక్షులు విజయ్ ,మా భాష ,చిన్న రాముడు ,శివమ్మ, ప్రమీలమ్మ పాల్గొన్నారు.



## కొనసాగుతున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర

**కర్నూలు కొండారెడ్డి బురుజు పై నుండి స్వయంగా పర్యవేక్షించిన**
**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్**
**డ్రోన్ కెమెరాల లైవ్ ద్వారా నిరంతర నిఘా.**
**ప్రశాంత వాతావరణంలో శోభాయాత్ర జరిగేలా పోలీసుల పటిష్ట నిఘా.**



**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలు నగరంలో మంగళవారం అంగరంగ వైభవంగా కొనసాగుతున్న వినాయక నిమజ్జన శోభాయాత్రను కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించారు. అక్కడి నుంచి పాత బస్టాండ్, గడియారం ఆసుపత్రి మీదుగా సాగే ఊరేగింపు రూట్‌ను పరిశీలించారు.అనంతరం కొండారెడ్డి బురుజు పైకి వెళ్లి, అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా శోభాయాత్ర ను , ప్రధాన కూడళ్లలోని ట్రాఫిక్ క్రమబద్ధీకరణను మరియు భక్తుల జనసందోహాన్ని స్వయంగా వీక్షించి భద్రతా చర్యలను సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్‌కు ఆటంకం కలగకుండా నిమజ్జనం సాఫీగా పూర్తయ్యేలా సమన్వయంతో విధులు నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యవేక్షణలో ఎస్పీ వెంట నంద్యాల ఏఎస్పీ సుస్మిత , కర్నూలు డీఎస్పీ రాఘవేంద్ర, డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు మధుసూదన్ రావు, కేశవరెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాలు

**స్పందించి నిల్వ నీటిని తొలిగించిన పంచాయతీ అధికారులు**

**వెలుగోడు, సెప్టెంబర్ 22 (నంది పత్రిక):**వెలుగోడు పట్టణంలో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టణంలోని హైస్కూల్ ఎదురుగా చిన్నపాటి వర్షానికే రోడ్డుపై నీరు చేరి మడుగులను తలపిస్తోంది.చెంచు కాలనీకి నీటి ముంపు రాకపోకలకు అంతరాయం:వర్షపు నీరు బుడ్డా వెంగళరెడ్డి చెంచు కాలనీ ఇళ్లలోకి చేరడంతో స్థానిక నివాసితుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. కాలనీవాసుల కష్టాలను గమనించిన టీడీపీ నాయకుడు రామదాసు, బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు వెంటనే గ్రామ పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్ దృష్టికి సమస్యను తీసుకెళ్లారు.

**తక్షణమే స్పందించిన అధికారులు:**విషయం తెలిసిన వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, ఎంపీడీఓ మురారిలు చెంచు కాలనీని క్షేత్రస్థాయిలో సందర్శించారు. పరిస్థితిని సమీక్షించిన అనంతరం, జేసీబీ సహాయంతో ప్రత్యేకంగా కాలువ తవ్వించి నిల్వ ఉన్న వర్షపు నీటిని బయటకు పంపించే ఏర్పాటు చేశారు. నీటి ముంపు నుంచి ఉపశమనం లభించడంతో కాలనీవాసులు, స్థానికులు అధికారులకు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## పట్టణాల ముఖచిత్రం మారేలా ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధి

**26 జిల్లాల్లో 123 మున్సిపాలిటీలకు మహర్దశ రూ.11,360 కోట్లతో అభివృద్ధి పనులకు వర్చువల్ శంకుస్థాపన**
**వర్చువల్ శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ**



**కర్నూలు సిటీ నందిపత్రిక** ఆంధ్రప్రదేశ్‌లోని పట్టణాల రూపురేఖలను మార్చేలా ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 123 మున్సిపాలిటీలలో రూ.11,360 కోట్లతో చేపట్టనున్న విలువైన అభివృద్ధి పనులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో వర్చువల్ విధానంలో కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ , ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి ఆదోని పట్టణం మున్సిపల్ హాల్ పాల్గొన్నారు. పట్టణాల్లో మెరుగైన మౌలిక వసతులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పన, రహదారులు, పారిశుద్ధ్యం, తాగునీరు తదితర రంగాల్లో అభివృద్ధికి ఈ కార్యక్రమం మరింత ఊతమివ్వనుందని ఆమె పేర్కొన్నారు.ప్రజా సంక్షేమం సమగ్ర అభివృద్ధి ఆధునిక మౌలిక వసతులే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు ఈ కార్యక్రమంలో కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, భాస్కర్ రెడ్డి,విట్టా రమేష్, రంగస్వామి, తిమ్మప్ప,రామచంద్ర,జనసేన పట్టణ అధ్యక్షులు రేణు వర్మ,మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు

## వైఎస్సార్‌సీపీ ‘శంఖారావం’.. భారీ జనసందోహంతో ఘనంగా విస్తృత స్థాయి సమావేశం!



**వెలుగోడు సెప్టెంబర్ 22 (నందిపత్రిక):** వెలుగోడు పట్టణంలోని ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్ వేదికగా శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం అత్యంత ఘనంగా, శ్రేణుల ఉత్సాహం మధ్య జరిగింది. శ్రీశైలం నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వెలుగోడు పట్టణంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చారు.

**సమావేశ ముఖ్య విశేషాలు & శిల్పా చక్రపాణి రెడ్డి దిశానిర్దేశం:**

**గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రతి గ్రామంలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ, నిరంతరం ప్రజలతో మమేకమై పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**కూటమి ప్రభుత్వంపై నిలదీత:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ‘సూపర్ సిక్స్‘ హామీల అమలుపై ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వాన్ని ఆయన గట్టిగా ప్రశ్నించారు. హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

**ఐడీ కార్డుల పంపిణీ :** కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ కమిటీల సభ్యులకు పార్టీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు. రాత్రింబవళ్లు పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి నాయకుడికి, కార్యకర్తకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సముచిత గుర్తింపు, అవకాశాలు కల్పిస్తామని భరోసానిచ్చారు.

**కార్యకర్తలకు కొండంత అభయం:** ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల బెదిరింపులకు, ఒత్తిళ్లకు లేదా అక్రమ కేసులకు కార్యకర్తలు ఏమాత్రం భయపడాల్సిన అవసరం లేదని, ప్రతి ఒక్కరికీ తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఒకవేళ అధికారులు చట్టపరిధి దాటి అన్యాయంగా వ్యవహరిస్తే, చట్టబద్ధంగా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ విస్తృత స్థాయి సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గ ముఖ్య నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి తో పాటు వివిధ మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.



## విదేశీ ఉద్యోగాల మోసాలు.. రాష్ట్రాలకు కేంద్ర హోం శాఖ కీలక హెచ్చరిక

విదేశీ ఉద్యోగాల పేరిట సాగుతున్న మానవ అక్రమ రవాణా, మోసాలు ఆందోళనకరంగా పెరిగిపోతుండటంపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను అప్రమత్తం చేస్తూ కీలక మార్గదర్శకాలతో కూడిన అడ్వైజరీని జారీ చేసింది. నకిలీ ఏజెంట్లపై ఉక్కుపాదం మోపాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

అధిక వేతనాలు ఆశచూపి అమాయకులను ప్రలోభపెడుతున్న మోసగాళ్లు, వారిని అక్రమ మార్గాల్లో (“డాంకీ రూట్స్“) విదేశాలకు తరలిస్తున్నారని కేంద్రం తన నివేదికలో పేర్కొంది. అక్కడ బాధితులను బంధించి, బలవంతంగా సైబర్ నేరాలు, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాల్లోకి నెడుతున్నారని హెచ్చరించింది. ఇటీవలి కాలంలో ఈ తరహా మోసాలు గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది.

# కెజిబివి విద్యార్థినులకు ఉచిత కంటి వైద్య శిబిరం



**వెలుగోడు, సెప్టెంబర్ 22 (నంది పత్రిక):**జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో వెలుగోడులోని స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం నందు మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ షేక్షావలి విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు.

**27 మంది విద్యార్థినులకు దృష్టిలోపం:**పాఠశాలలో మొత్తం 273 మంది విద్యార్థినులకు కంటి పరీక్షలు చేయగా, వారిలో 27 మంది విద్యార్థినులు దృష్టిలోపంతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. దృష్టిలోపం ఉన్న విద్యార్థినులకు త్వరలోనే ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

**డిజిటల్ పరికరాలకు దూరంగా ఉండాలి డాక్టర్ షేక్షావలి:** ఈ సందర్భంగా డాక్టర్ షేక్షావలి మాట్లాడుతూ.. విద్యార్థినులు సెల్‌ఫోన్లు మరియు ఇతర డిజిటల్ పరికరాలను ఎక్కువసేపు ఉపయోగించకూడదని సూచించారు. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆకుకూరలు, క్యారెట్, గుడ్లు, పండ్లు వంటి పోషకాహారాన్ని ప్రతిరోజూ తీసుకోవాలని తెలిపారు. చదువుకునే సమయంలో తగినంత వెలుతురు ఉండేలా చూసుకోవాలని, ఏ చిన్న సమస్య ఉన్నా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు, సీహెచ్ఓ జితేంద్ర, ఏఎన్ఎం వరలక్ష్మి దేవి, ఆశా వర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు మరియు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఘనంగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు



**కర్నూలు సిటీ నంది పత్రిక** మహాకవి శ్రీ గురజాడ అప్పారావు 164 వ జయంతి వేడుకలు స్థానిక ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథులుగా పాణ్యం నియోజకవర్గ టిడిపి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి హాజరై గురజాడ అప్పారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. గురజాడ అప్పారావు ఆదర్శనీయులని ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని గౌడ్ జనార్దన్ రెడ్డి అన్నారు ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ ఎస్ కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

# వ్యర్థాలు తీసుకుంటాం... సరుకులు ఇస్తాం

## స్వచ్ఛ రథంతో ప్రభుత్వం వినూత్న నినాదం
## పరిసరాల పరిశుభ్రం... ప్రజారోగ్యమే లక్ష్యం



**జూపాడుబంగ్లా సెప్టెంబర్ 23( నంది పత్రిక)** పరిశారాలు శుభ్రముగా ఉంచుతూ ప్రజా ఆరోగ్యానికి భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ అమల్లోకి తీసుకువచ్చింది. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటికే గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీనికి తోడు కొత్తగా మన వ్యర్థాలు సేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ (ఆర్ జి ఎస్ ఏ) పథకం పేరుతో దీన్ని అమలు చేస్తున్నామన్నారు. ఇందుకోసం స్వచ్ఛ రథము అందు బాటులోకి తెచ్చారు. ప్రతి గ్రామానికి స్వచ్ఛ రథం వస్తుందన్నారు. ఈ వాహనానికి ఒక ఆపరేటర్ ను కూడా నియమించారు. ఈ విధముగా ప్రభుత్వం ఘన వ్యర్థాల సేకరణలో ముందుకు వెళుతున్నది. దీని కారణంగా పరిసరాలు శుభ్రముగా ఉండడంతో పాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ ఆలోచన అన్నారు.**సరుకులు లేదా నగదు..** స్వచ్ఛ రథము ఆదివారం మినహా మిగతా రోజుల్లో మండల పరిధిలోని గ్రామాల్లో తిరుగుతుంది. ప్రతి ఇంటికి వెళ్లి పాడైపోయిన, పక్కన పడేసిన మొత్తం తొమ్మిది రకాల ఘన వ్యర్ధాలను సేకరించి అక్కడే తూకం వేస్తారు. బరువు ఆధారముగా తీసుకుని ప్రభుత్వ నిర్ణయించిన ధర ప్రకారం లెక్క కడుతారు. తరువాత ఇక్కడ అమ్మ కందారులకు రెండు రకాల అవకాశాలు కల్పిస్తారు. ఒకటి సరుకులు, రెండోది వాటి విలువ సరిపడా డబ్బులు తీసుకుని ఎలుసుబాటు కల్పిస్తారు. కిలో ఇనుము రూ20, పేపర్లు రూ 15, పుస్తకాలు రూ పది, అట్టపెట్టెలు రూ 10, ప్లాస్టిక్ సీసాలు రూ 20, గాజు సీసాలు రూ రెండు, చొప్పున చెల్లిస్తారు. సేకరించినాయి ఘన వ్యర్థాలకు వాహనం ఆపరేటరు స్వయంగా బహిరంగ మార్కెట్లో విక్రయించి సొమ్ము చేసుకుంటాడు. కావలసిన నిత్యవసర సరుకులు కొనుగోలు చేస్తాడు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. **వాహనంలో ఉండే వస్తువులు ఇవే....** కొబ్బరి నూనె, సర్ఫ్ ప్యాకెట్లు, రిన్ సబ్బులు, స్నానానికి ఉపయోగించే సబ్బులు, టీ పొడి, బ్రూ కాఫీ ప్యాకెట్లు, హార్లిక్స్ లు, కంఫర్ట్ ప్యాకెట్లు, టూత్ పేస్టులు, షాంపులు, పెన్నులు గోధుమపిండి, వేరుశనగపప్పు, మినగపప్పు, కందిపప్పు తదితర వస్తువులు వాహనంలో అందుబాటులో ఉంటాయి. ప్రజలకు ఎంతో ఉపయోగము... డి గోపికృష్ణ, ఎంపీడీవో, జూపాడుబంగ్లా (మండలం) ఘన వ్యర్థాలను స్వచ్ఛ రథానికి అందజేసి కావలసిన డబ్బులు లేదా నిత్యవసర వస్తువులు తీసుకోవచ్చు. ఇది ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పరోక్షముగా పరిసరాలు పరిశుభ్రముగా ఉండడంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా డొకా ఉండదు. రోజుకో గ్రామం చొప్పున స్వచ్ఛ రథము మండల వ్యాప్తంగా తిరుగుతుంది . ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలి.

# గూడూరు పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి బృహత్తర అడుగు
## కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**కర్నూల్ సిటీ, నంది పత్రిక** కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం గూడూరు నగర పంచాయతీ పరిధిలోని పడమర బీసీ కాలనీలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ళిహెచ్ ఏ ఎం రి పథకం ద్వారా రూ. 12 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి స్థానికంగా పాల్గొని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. పట్టణాలు, నగర పంచాయతీలలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులను చేపడుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, నగర పంచాయతీల అభివృద్ధిలో భాగంగా సుమారు రూ. 11,360 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో ప్రారంభించారని ఎమ్మెల్యే తెలిపారు. గూడూరు నగర పంచాయతీ అభివృద్ధికి రూ. 12 కోట్ల నిధులు కేటాయించడం పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ నిధులతో పట్టణంలో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. గూడూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగాశ్రీరంగాపురంలో 16 రోజుల పండుగ.



**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 22 (నంది పత్రిక):** మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో 16 రోజుల పండుగ ఘనంగా మంగళవారం నిర్వహించారు. గత 16 రోజుల క్రితం గ్రామంలో గంగమ్మ విగ్రహాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పునర్ ప్రతిష్ట చేశారు. అదేరోజు గ్రామంలో భారీ వర్షం కురిసినట్లు గ్రామస్తులు తెలిపారు. మరల 16 రోజుల అనంతరం గ్రామంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు బోనాలతో గంగమ్మకు పూజలు చేశారు. పండుగ సందర్భంగా ఏర్పాటుచేసిన కోలాటం గ్రామస్తులను అలరించింది. గ్రామంలో వర్షాలు కురిసే పంటల సమృద్ధిగా పండే ప్రజల సుఖశాంతులతో జీవించాలని పండగ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# కొత్త పింఛన్ల కొరకు 1227 దరఖాస్తులు




**రుద్రవరం ప్రతినిధి సెప్టెంబర్ 22 (నంది పత్రిక):** రుద్రవరం మండలంలో ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్ల కొరకు 1227 దరఖాస్తులు వచ్చినట్లు మండల పరిషత్ కార్యాలయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వము అర్హులైన వారు పింఛన్ల కొరకు దరఖాస్తులు చేసుకోవాలని అవకాశం కల్పించడంతో అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 21 గ్రామ పంచాయతీలలోని వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, బెస్తలు, డప్పు కళాకారుల తో పాటు అర్హత కలిగిన వారు పింఛన్ల కొరకు దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# కొనసాగుతున్న గణేష్ నిమజ్జన శోభాయాత్ర ను, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించిన కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

## నన్నూరు, కర్నూలు వినాయక నిమజ్జన ఘాట్ల పరిశీలన చేసిన ఎస్పీ.
## నన్నూరు వినాయక్ ఘాట్ వద్ద ఎమ్మెల్యే గౌరిచరిత తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించిన ఎస్పీ.

**కర్నూల్ సిటీ నంది పత్రిక** కర్నూలులో మంగళవారం కొనసాగుతున్న వినాయక నిమజ్జన శోభాయాత్ర , భద్రతా ఏర్పాట్లను కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ముందుగా నన్నూరు టోల్ ప్లాజా సమీపంలోని హంద్రీ-నీవా ప్రధాన కాలువ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ఘాట్‌ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే గౌరు చరిత తో కలిసి వినాయక విగ్రహానికి పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘాట్ వద్ద నీటి మట్టం, క్రేన్ల పనితీరు, విద్యుత్ దీపాలు, బారికేడింగ్ మరియు గజ ఈతగాళ్ల సంసిద్ధతను సమీక్షించారు. అనంతరం కర్నూలు నగరంలోని ప్రధాన నిమజ్జన వినాయక ఘాట్ ను పరిశీలించారు. భక్తుల భద్రతకు చేపట్టిన చర్యలను అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటు సీఐలు మధుసూదన్ రావు, తేజమూర్తి, శేషయ్య, గౌతమి, ఎస్సై సునీల్ పాల్గొన్నారు.

# పాత్రికేయ గణపతి లడ్డూను దక్కించుకున్న డాక్టర్ కె. హరినాథ్ రెడ్డి



**కర్నూలు సిటీ నందిపత్రిక** కర్నూలు కలెక్టరేట్‌లోని సమాచార శాఖ ఆవరణలో పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన పాత్రికేయ గణపతికి తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం గణనాథుడి నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని పాత్రికేయ గణపతి లడ్డూ వేలంపాటను నిర్వహించారు. ఈ వేలంపాటలో శ్రీచక్ర మీడియా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె. హరినాథ్ రెడ్డి రూ. 10 వేలతో పాత్రికేయ గణపతి లడ్డూను దక్కించుకున్నారు. లడ్డూను దక్కించుకున్న డాక్టర్ కె. హరినాథ్ రెడ్డికి పాత్రికేయ గణపతి మహోత్సవ సమితి సభ్యులు అభినందనలు తెలిపారు. అనంతరం సమితి సభ్యులు డాక్టర్ కె. హరినాథ్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం డీజే వాహనంతో ఉత్సవ వాతావరణంలో డాక్టర్ కె. హరినాథ్ రెడ్డిని ఆయన నివాసం వరకు సాగనంపారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించిన పాత్రికేయ గణపతి మహోత్సవంలో ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పాత్రికేయులు, సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, వివిధ వర్గాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథుడి ఆశీస్సులు పొందారు. పాత్రికేయుల ఐక్యతకు ప్రతీకగా నిర్వహించిన పాత్రికేయ గణపతి మహోత్సవం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. నిమజ్జనోత్సవంలో భాగంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సందడి మధ్య నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

# వి అర్ ఏ ల డిమాండ్లకు కృషి




**శిరివెళ్ల :(నంది పత్రిక)** గ్రామ రెవెన్యూ సహాయకుల డిమాండ్ల సాధనకు అలుపెరగని పోరాటం తప్పదని అందుకు నిరంతరం కృషి చేస్తామని మండల యూనియన్ నాయకులు పేర్కొన్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటాలు, నిరసనలు మరియు సమ్మెలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శిరివెళ్ల మండల కేంద్రంలో సైతం పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఈ కార్యక్రమంలో సిరివెళ్ల మండల అధ్యక్షులు సర్లే సర్న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆందోళన నిర్వహించి నినాదాలు చేశారు. ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు చేపట్టిన కారణంగా ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల మండల అధ్యక్షులు పాములేటి ఉపాధ్యక్షులు మాలి కార్యదర్శి ముని ట్రెజరీ మస్తాన్ కోనేటి తిరుపాల్, చెన్నూరు తిరుపాలు సాహెల్ తదితర వీఆర్ఏ లతోపాటు సుమారు 30 మందికి పైగా ధర్నాలతో తాసిల్దార్ కార్యాలయం దద్దరిలేలా ఆందోళన చేపట్టారు.

# సౌభాగ్య పౌడరు అమ్మితే కఠిన చర్యలు



**బండి ఆత్మకూరు నంది పత్రిక సెప్టెంబర్ 22:** దుకాణాలలో సౌభాగ్య పౌడర్ను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని బండి ఆత్మకూరు ఎస్సై జగన్మోహన్ హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం బండి ఆత్మకూరు కు చెందిన దుకాణ యజమానులను పోలీస్ స్టేషన్కు ఎస్సై పిలిపించారు. ఇకనుండి సౌభాగ్య పౌడర్ అమ్మ వద్దని వారికి సూచించారు. సౌభాగ్య పౌడరు వినియోగం కారణంగా కుటుంబాలు ఎదుర్కొనే నష్టాలను దుష్ప్రభావాలను గురించి దుకాణం యజమానులకు వివరించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే సౌభాగ్య విక్రయాలకు ఇకనుండి స్వస్తి చెప్పాలని, ఎస్ఐ హెచ్చరించారు. కిరాణా కొట్టు దుకాణాలలో సౌభాగ్య పౌడరు ఎవరైనా అమ్ముతున్నట్లయితే అటువంటి వారిని గుర్తించి పోలీసులకు సమాచారం అందజేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

# అహోబిలంలో గంగమ్మ ఉత్సవం వాయిదా
## వైకాపా సీనియర్ నాయకులు నాసారి వెంకటేశ్వర్లు



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 22, నంది పత్రిక** అహోబిలంలో ఈనెల 27 వ తేదీన నిర్వహించవలసిన గంగమ్మ ఉత్సవం అనివార్యకారణాల వలన అక్టోబర్ 4 వ తేదీ ఆదివారంనకు వాయిదా వేయడం జరిగిందని మాజీ కె డి సి సి బి డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు ( సీసా ) తెలిపారు. మంగళవారం అహోబిలంలో ఆయన మాట్లాడుతూ వర్షాబావ పరిస్థితిని బట్టి వానలు అహోబిలంలో బాగా కురువాలని ఈ నెల 27 వ తేదీ ఆదివారం గంగమ్మ ఉత్సవం నిర్వహించాలని ముందుగా నిర్ణయించామన్నారు. కానీ అదేరోజు గ్రామంలో ఇంకో వర్గం గంగమ్మ ఉత్సవం నిర్వహించడం వలన మా ఉత్సవానికి పోలీస్ అధికారులు అనుమతులు ఇవ్వలేదన్నారు. కాబట్టి మా గంగమ్మ ఉత్సవం అక్టోబర్ 4 వ తేదీ ఆదివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని అందరూ గమనించి అహోబిలంలో వచ్చేనెల 4వ తేదీన జరిగే గంగమ్మ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com

# మున్సిపాలిటీల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.164 కోట్ల కేటాయింపు




## రూ.550 కోట్లతో నంద్యాల పట్టణ రూపురేఖల్లో సమగ్ర మార్పు

## నంద్యాల పట్టణాన్ని స్వచ్ఛ ఆరోగ్యకర నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం ఉండాలి : జిల్లా కలెక్టర్ రాజ కుమారి గణియా

**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 22(నంది పత్రిక):-** : నంద్యాల జిల్లా సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ మరియు నంద్యాల మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి రాజ కుమారి గణియా తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణ మున్సిపల్ టౌన్ హాల్ నందు ఏర్పాటు చేసిన హైబ్రిడ్ మాన్యుటి మోడల్ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా రూ.164 కోట్లు విలువైన అభివృద్ధి పనులకు గౌ. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు కుప్పం నుంచి శంకుస్థాపన చేయనున్న కార్యక్రమానికి జిల్లా నుంచి హాజరైన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ప్రజా ప్రతినిధులు తదితర అధికారులు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ పథకం కింద జిల్లాలోని వివిధ మున్సిపాలిటీలకు రూ.164 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించిందని, ఈ అభివృద్ధి పనులకు గౌరవ ముఖ్యమంత్రి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారన్నారు.

నంద్యాల పట్టణం: రూ.63 కోట్లు
ధోన్ మున్సిపాలిటీ: రూ.21 కోట్లు
ఆళ్లగడ్డ మున్సిపాలిటీ: రూ.21 కోట్లు
ఆత్మకూర్ మున్సిపాలిటీ: రూ.21 కోట్లు
నందికొట్కూర్ మున్సిపాలిటీ: రూ.21 కోట్లు
బేతంచెర్ల నగర పంచాయతీ: రూ.17 కోట్లు

రూ.550 కోట్లతో నంద్యాల పట్టణ సమగ్ర అభివృద్ధి

హెచ్ ఏ హెమ్ కింద కేటాయించిన రూ.63 కోట్లతో పాటు అమృత 1.0, అమృత 2.0, 15వ ఆర్థిక సంఘం నిధులు, మైనారిటీ సంక్షేమ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి తదితర నిధులను అనుసంధానం చేస్తూ నంద్యాల పట్టణంలో సుమారు రూ.550 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ నిధుల మంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ కి జిల్లా కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.

**ప్రధాన అభివృద్ధి పనులు**

**మంచినీటి సరఫరా:** నంద్యాల పట్టణంలోని ప్రతి ఇంటికీ నిరంతర, స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా నీటి సరఫరా వ్యవస్థను బలోపేతం చేయనున్నారని అన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను పటిష్టం చేయడంతో పాటు అదనపు వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు



ఉంటుందన్నారు. రహదారులు, కాలువల అభివృద్ధి: పట్టణంలోని అవసరమైన ప్రాంతాల్లో నాణ్యమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు, అమృత పథకం కింద నూతన సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్ టీ పి) ఏర్పాటు చేసి మురుగునీటిని శుద్ధి చేయడంతో పాటు, శుద్ధి చేసిన నీటిని అవసరమైన విధంగా వినియోగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పార్కుల అభివృద్ధి, పట్టణ సుందరీకరణ పనులు చేపడుతామన్నారు. నంద్యాల పట్టణాన్ని స్వచ్ఛ నంద్యాల ఆరోగ్యకర నంద్యాల జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని తెలిపారు. 100 శాతం ఇంటింటి చెత్త సేకరణకు ప్రజలు సహకరించాలని, చెత్తను రోడ్లపై, డ్రైనేజీ కాలువల్లో వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలని అన్నారు. ఇంటింటి నుంచి సేకరించే చెత్తను శాస్త్రీయ పద్ధతుల్లో ప్రాసెస్ చేసి వర్మీ కంపోస్ట్, సేంద్రీయ ఎరువులను తయారు చేసి కిచెన్ గార్డెన్లు, టెర్రస్ గార్డెన్లతో పాటు రైతులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులన్నింటినీ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు సమన్వయంతోపర్యవేక్షించాలని ఆదేశించారు. పనులను పురోగతిన ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ,ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గోరుకల్లు పరిస్థితిపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

## ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత.. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ వెంట్‌గేట్ ఘటనపై సమగ్ర విచారణ.. బాధ్యులపై కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 22(నంది పత్రిక):-** పాణ్యం మండలం గోరుకల్లు గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం ఆమె గోరుకల్లు గ్రామాన్ని స్వయంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పరిస్థితులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు సంబంధించిన వెంట్‌గేట్‌ను ఎవరు ఎత్తారు, ఎవరి ద్వారా గేట్ తెరవబడింది అనే అంశంపై సమగ్ర విచారణ కొనసాగుతోందని కలెక్టర్ తెలిపారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చిన అనంతరం బాధ్యులుగా తేలిన వారిపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వరదలు, నీటి ప్రవాహం తదితర కారణాలతో ఎక్కడెక్కడ నష్టం వాటిల్లిందో ఆయా ప్రాంతాలను గుర్తించి, పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతూ, అవసరమైన మేరకు బ్లీచింగ్ పౌడర్‌ను సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో)ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. పంటలు నష్టపోయిన గ్రామాల్లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు అధికారుల బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి, నష్టం మరియు ప్రజల సమస్యలపై సమగ్ర నివేదికను సమర్పించేలా అధికారులకు ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. గోరుకల్లు, పరిసర ప్రాంతాల్లో నీటి మట్టం సుమారు మూడు అడుగుల మేర ఉన్న నేపథ్యంలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో నిరంతరం పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితులు ఏర్పడిన వెంటనే ప్రజలకు తక్షణ సహాయం అందించేలా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల భద్రతకు ఎటువంటి ముప్పు కలగకుండా జిల్లా యంత్రాంగం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపడుతోందని తెలిపారు.



# విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలి






## అకడమిక్ ప్రగతిపై నిరంతర పర్యవేక్షణతో మెరుగైన ఫలితాలు సాధించాలి

## జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 22(నంది పత్రిక):-** జిల్లాలో పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంపొందించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి విద్యాశాఖ అధికారులను, ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని బొమ్మల సత్రం సమీపంలోని మానవ వనరుల కేంద్రంలో నిర్వహించిన ఎంఈఓలు (× & ××) జిల్లా స్థాయి వన్‌డే ఓరియంటేషన్ కార్యక్రమం సందర్భంగా విద్యాశాఖ అకడమిక్ ప్రగతిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంఈఓలు, ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలకు క్రమం తప్పకుండా హాజరు కాని విద్యార్థులను గుర్తించి, వారి కుటుంబ పరిస్థితులను పరిశీలించి, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి కారణాలతో పాఠశాలకు దూరమవుతున్నారో గుర్తించి, వారిని తిరిగి పాఠశాలలకు తీసుకువచ్చి, నిరంతర హాజరు ఉండేలా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ 'ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకూడదు' అనే లక్ష్యంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అకడమిక్ ప్రగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేలా ఉపాధ్యాయులు వినూత్న బోధనా పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు పాఠశాలలను క్రమం తప్పకుండా సందర్శించి విద్యార్థుల హాజరు, అభ్యసన స్థాయిలు, విద్యా ఫలితాలను సమీక్షిస్తూ అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని ఆదేశించారు. సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేసి నంద్యాల జిల్లాను విద్యా ప్రమాణాలు, విద్యార్థుల హాజరు, అకడమిక్ ఫలితాల్లో మరింత ముందంజలో నిలిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఇఓ జనార్దన్ రెడ్డి, ఐసిడిఎస్ పిడి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# 52 వార్డుల్లో 1.99 లక్షల మంది ఓటర్లు--

## మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న--



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబరు 22 ( నంది పత్రిక )**నంద్యాల పట్టణంలోని 52 వార్డుల్లో మొత్తం 1,99,238 మంది ఓటర్లు ఉన్నారని మున్సిపల్ కమిషనర్ బి. శేషన్న తెలిపారు. ఇందులో 96,672 మంది పురుషులు, 1,02,488 మంది మహిళలు, 78 మంది ఇతరులు ఉన్నారని వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం 52 వార్డుల ఓటర్ల జాబితాను కమిషనర్ బి. శేషన్న అధికారికంగా విడుదల చేశారు. ఓటర్ల జాబితాలో ప్రతి అర్హుడి పేరు ఉండేలా, అనర్హుల పేర్లు లేకుండా క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే గుర్తించి సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఓటర్ల జాబితా అత్యంత కీలకమని, ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని బి. శేషన్న స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె. కళ్యాణిబాయి, ఎంఈ నాగభూషణం రెడ్డి, డీఈలు పవన్ కుమార్, రసూల్, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహమూర్తి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విక్రమ్, శానిటేషన్ సూపర్‌వైజర్లు మురళీధర్, శివప్రసాద్ రెడ్డితో పాటు మున్సిపల్ సిబ్బంది. సచివాలయ సిబ్బంది. పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ బాధితులకు సకాలంలో న్యాయం అందేలా చర్యలు

## పెండింగ్ కేసుల విచారణ వేగవంతం చేయాలి

## సమస్యల పరిష్కారంపై ప్రతి 15 రోజులకు సమీక్ష నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

**నంద్యాల బ్యూరో, సెప్టెంబర్ 22(నంది పత్రిక):-** ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసుల్లో విచారణను వేగవంతం చేసి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యలను సున్నితంగా పరిగణించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించి, చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై నమోదైన కేసులు, వాటి విచారణ పురోగతి, బాధితులకు అందుతున్న న్యాయపరమైన, ప్రభుత్వపరమైన సహాయం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో ప్రస్తావించిన సమస్యలను అధికారులు పూర్తిస్థాయిలో పరిశీలించి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గుర్తించిన సమస్యలపై ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్ష నిర్వహించి, తీసుకున్న చర్యలు మరియు పురోగతిని పరిశీలించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

**సఫాయి కర్మచారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి**

సఫాయి కర్మచారుల సమస్యలపై చర్చిస్తూ, వారికి పి ఈ , ఈ ఎస్ ఐ తదితర సామాజిక భద్రతా ప్రయోజనాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ ఎస్ ఐ , పి ఎఫ్ వంటి సౌకర్యాలను అర్హులైన కార్మికులందరూ సద్వినియోగం చేసుకునేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సానిటేషన్ వర్కర్లకు నిబంధనల ప్రకారం పని దినాలు, సెలవులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని గ్రామ పంచాయతీల్లో నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతున్న అంశంపై స్పందిస్తూ, పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



**తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు** ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో ఆర్ ఓ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నంద్యాల పట్టణ పరిధిలో ఆర్ ఓ ప్లాంట్ల ఏర్పాటుకు అనువైన స్థలాల గుర్తింపులో ఎదురవుతున్న ఇబ్బందులను అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. చిన్న విస్తీర్ణంలో ఉన్న స్థలాలను కూడా పరిశీలించి, సాధ్యమైన చోట్ల తాగునీటి సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి: ఎస్పీ** జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ బాధితుల సమస్యలను సున్నితంగా పరిగణించి, వారికి అవసరమైన న్యాయపరమైన, ప్రభుత్వపరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనల ప్రకారం త్వరితగతిన విచారణ పూర్తి చేసి పరిష్కరించేలా సంబంధిత ఎస్ డి పి ఓ లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఖాదర్ బాషా, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివారెడ్డి, ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, నరేంద్రనాథ్ రెడ్డి, డివియంసీ కమిటీ సభ్యులు నాగరాజు, కాశన్న, రవికాంత్ బాబు, రమేష్ నాయక్, నాగ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో అహోబిలం క్షేత్రం అభివృద్ధి

## ఎ ఒ రంగరాజు

**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 22, నంది పత్రిక** అందరి సహకారంతో ప్రముఖ వైష్ణవ పుణ్య క్షేత్రమైన అహోబిలం దేవస్థానం అభివృద్ధి కోసం కృషి చేస్తామని అహోబిలం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం పరిపాలన అధికారి రంగరాజు తెలిపారు. మంగళ వారం ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు.



అనంతరం అయన మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. టూరిజం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఆలయ అభివృద్ధి దశలవారీగా పూర్తి చేసి, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్థామన్నారు. గత పది సంవత్సరాల నుండి అహోబిల క్షేత్రం అభివృద్ధి చెందిందని అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్, గెస్ట్ హౌస్ అన్నదానం 100 రూములు భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్నట్లు రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుంటామని అందుకు ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరసింహారెడ్డి, టీడీపీ నాయకులు గూడూరు సంజీవ రాయుడు, రమణ, టూరిజం అధికారులు, మేనేజర్ మాధవన్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా ఇసుక దందా..!





### ఉచిత ఇసుక పాలసీకి తూట్లు పొడుస్తున్న అక్రమార్కులు
### ఇసుక కోసం ప్రజలపై అదనపు భారం..
### ఫిట్‌నెస్ లేని టిప్పర్లతో రవాణా?


**ఆదోని నంది పత్రిక ప్రతినిధి** ఆదోని పట్టణంలో ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానానికి కొందరు అక్రమార్కులు తూట్లు పొడుస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక అవసరమైన ప్రజలు తమను సంప్రదించాల్సిందేనని, ఇతరుల ద్వారా ఇసుక తెచ్చుకుంటే తమకు చెల్లింపులు చేయాల్సి వస్తోందని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**ఉచిత ఇసుక.. మధ్యలో అక్రమ వసూళ్లా?** ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నప్పటికీ, పట్టణంలో ఇసుక కోసం అదనపు మొత్తాలు చెల్లించాల్సి వస్తోందని గృహ నిర్మాణదారులు వాపోతున్నట్లు తెలుస్తోంది. ఇసుక సరఫరాపై కొందరు వ్యక్తులు ఆధిపత్యం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**ఫిట్‌నెస్ లేని టిప్పర్లతో రవాణా?** ఇసుక తరలింపునకు ఉపయోగిస్తున్న కొన్ని టిప్పర్లకు సరైన పత్రాలు, ఫిట్‌నెస్ లేకపోయినా రహదారులపై తిరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుకను తరలించే సమయంలో దుమ్ము, ఇసుక రోడ్డుపైకి ఎగిరిపడటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు.ప్రజల భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఇసుక రవాణా చేసే వాహనాల ఫిట్‌నెస్, అనుమతులు, పత్రాలు, ఓవర్‌లోడింగ్ తదితర అంశాలను అధికారులు తనిఖీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**అధికారుల దాడులు.. ఫలితం ఏమిటి?** గతంలో ఇసుక అక్రమ రవాణాపై అధికారులు తనిఖీలు, దాడులు నిర్వహించినప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదని స్థానికులు అంటున్నారు. దీంతో గృహ నిర్మాణదారులు ఇసుక కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోతున్నారు. ఇసుక అక్రమ వ్యాపారానికి కొందరు ప్రజాప్రతినిధులు, పోలీసులు, సంబంధిత అధికారుల అండదండలు ఉన్నాయనే వినికిడి, ఆరోపణలు కూడా పట్టణంలో వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక ధృవీకరణ లేదు.

**సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్**ఇసుక సరఫరా వ్యవస్థపై సమగ్ర విచారణ నిర్వహించి, ప్రభుత్వ ఉచిత ఇసుక విధానం ప్రజలకు వాస్తవంగా అందేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇసుక అక్రమ రవాణా, అనధికార వసూళ్లు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి ఇసుక రవాణా వ్యవస్థపై ప్రత్యేక తనిఖీలు చేపడతారా? లేక సాధారణ తనిఖీలకే పరిమితమవుతారా? అన్నది వేచి చూడాల్సి ఉంది.




## స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొందాం... వైసీపీని అధికారంలోకి తీసుకువద్దాం..

### మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి..



**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 22 ( నంది పత్రిక )**కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం.. స్థానిక సంస్థల ఎన్నికలను సమర్థవంతంగా ఎదుర్కొని వైసీపీని అధికారంలోకి తీసుకువద్దామని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. నంద్యాల పట్టణం అన్నపూర్ణ ఫంక్షన్ హాల్ నందు నేటి సాయంత్రం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. అనంతరం వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు పార్టీ గుర్తింపు కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ సీఈసీ సభ్యుడు పీపీ నాగిరెడ్డి, వైసీపీ డోన్ నియోజకవర్గ పరిశీలకుడు పీపీ మధుసూధన్ రెడ్డి, నంది రైతు సమాఖ్య అధ్యక్షుడు బెక్కం రామసుబ్బారెడ్డి, వైసీపీ సీనియర్ నాయకుడు ప్రహల్లాద రెడ్డి , గోస్పాడు మండల అధ్యక్షుడు ఆర్థర్ సైమన్, మండల నాయకులు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిశోర్ రెడ్డి మాట్లాడుతూ...స్థానిక సంస్థల ఎన్నికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమర్థవంతంగా ఎదుర్కొని విజయం సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. పార్టీకి కార్యకర్తలే వెన్నెముక లాంటి వారని, కష్ట పడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని, ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. రానున్న ఎన్నికలవేల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు, పాలనలోని వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి కార్యకర్త యోదుల్లా ముందుకు వెళ్లాలని విజయాన్ని అందించాలని కోరారు. పార్టీ అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరికీ పార్టీ ఐడీ కార్డులు అందజేస్తామని నాయకులు తెలిపారు.



# నా వ్యాపార లావాదేవీలకు నా రక్త సంబంధీకులకు ఎలాంటి సంబంధం లేదు

### నా రక్త సంబంధీకులకు చెందిన వ్యాపార సముదాయాలకు నాకు వాటి లావా,దేవీలకు ఎలాంటి సత్సంబంధాలు లేవు..
### నా మీద కొంత మంది చేసే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దు.. గోళ్ళ రాజేష్

**నంద్యాల సిటీ బ్యూరో సెప్టెంబర్ 22 ( నంది పత్రిక )**

నంద్యాల వాసి ప్రముఖ వ్యాపారవేత్త,సామాజికవేత్త గోళ్ళ రాజేష్ తెలియజేయడం ఏమనగా నేను నంద్యాల వాసిని గతంలో 2000 సం“ నుండి నాకు నా కుటుంబానికి, నా రక్త సంబంధీకులకు కొన్ని నా వ్యక్తిగత కారణాల వల్ల నా వ్యాపార లావాదేవీలకు నా రక్త సంబంధీకులకు ఎలాంటి సంబంధం లేదు మరియు నా రక్త సంబంధీకులకు చెందిన వ్యాపార సముదాయాలకు నాకు వాటి లావా,దేవీలకు ఎలాంటి సత్సంబంధాలు లేవు . ఈ విషయం నేను ఇప్పుడు ఎందుకు ప్రస్తావిస్తున్నాను అనే దానికి కారణం ఉంది. నేను నా వ్యాపారాల ద్వారా వచ్చే ఆదాయం లో నుండి కొంతమేర నా నంద్యాల నియోజవర్గ ప్రజల కోసం ఇప్పటికే దాదాపు మూడు సంవత్సరాలుగా నా వంతు సహాయంగా ఎన్నో సేవా కార్యక్రమాలు,ఆర్థిక సహకారాలు, సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసి నంద్యాల నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆదుకోవాలని వారి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నా వంతు సహాయం చేస్తూ వస్తున్నాను.



అందులో భాగంగా ఇటీవల నంద్యాల టెక్కె మార్కెట్ యార్డ్ నందు మొదటి విడుతలో ఒక సూపర్ మార్కెట్ ను ప్రారంభించడం జరిగింది. అనంతరం అతి త్వరలోనే మిగతా రూములలో కూడా నంద్యాల నియోజకవర్గ పేద,మధ్యతరగతి ప్రజల కొరకు నిత్యవసరాలపై 15% రాయితీతో కొనుగోలు అందిస్తున్నాము ప్రజలందరు కూడా హర్షిస్తున్నందుకు చాలా చాలా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.. అయితే నా వ్యాపారాల నుండి వచ్చే ఆదాయంలో నుండి మరికొంత భాగం పెంచి నంద్యాల నియోజకవర్గంలోని నా నంద్యాల ప్రజలే నా కుటుంబంగా భావించి నేను నంద్యాల ప్రజల కొరకు మరింత సేవా కార్యక్రమాలు విస్తరించాలని ఉద్దేశంతో ఈరోజు మీ ముందు నా మనసులోని భావాలని వ్యక్తం చేస్తున్నాను కాబట్టి నా కుటుంబం నంద్యాల నియోజకవర్గం నియోజవర్గ ప్రజలందరూ నా తోబుట్టువులు వారి కొరకు భవిష్యత్తులో ఇంకా ఎన్నో నూతన పథకాలు తెచ్చి మరెన్నో ఉత్తమమైనటువంటి సంక్షేమ పథకాలను అందించి ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు నిరుద్యోగ విద్యార్థిని, విద్యార్థులకు ఉపాధి కల్పన చూపించే విధంగా మరెన్నో నూతన కార్యక్రమాలను రూపొందిస్తున్నామని మీ అందరికీ తెలియజేసుకుంటున్నాను. కాబట్టి నా కుటుంబం అంటే నంద్యాల నియోజకవర్గ ప్రజలే నా వ్యక్తిగత కుటుంబానికి నాకు 2000 సం“ నుండి నాకు నా రక్త సంబంధీలకు ఎలాంటి సంబందాలు లేవు కాబట్టి ఇంత పెద్ద నియోజకవర్గం నా కుటుంబంగా భావిస్తూ మీ అందరికీ సేవ చేసే సదవకాశం ఆ భగవంతుడు నా కల్పించినందుకు ఆ భగవంతునికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను.

## మున్సిపల్ కార్యాలయం లో మెప్మా కార్యకలాపాలపై సమీక్ష



**డోన్ : నంది పత్రిక సెప్టెంబర్ :22** మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్‌పీలతో నంద్యాల జిల్లా మెప్మా పీడీ వెంకటదాస్ సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు, యాప్ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ పథకాల అమలు, ఎండీఎంఎల్, ఎంసీపీ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. ఆర్‌పీలు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, స్వయం సహాయక సంఘాలను నిరంతరం పర్యవేక్షిస్తూ మహిళలకు ప్రభుత్వ పథకాలు, సేవలపై అవగాహన కల్పించాలని వెంకటదాస్ సూచించారు. యాప్‌లో వివరాల నమోదును సక్రమంగా పూర్తి చేసి పెండింగ్ పనులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో చేపడుతున్న ప్రత్యేక ప్రాజెక్టులు, పీఎం-స్వనిధి పథకం అమలుకు మెప్మాకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో అక్షర ఆంధ్ర డిప్యూటీ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్‌పీ వేమారెడ్డి, సీవో సువర్ణమ, సూపర్‌వైజర్ ఫయాజ్, కంప్యూటర్ ఆపరేటర్ జావీద్, ఆర్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.



# నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలనీ,,,,

### ఈనెల 24,25 తేదీలలో అన్ని గ్రామ సచివాలయాల ముందు నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయండి,,,,,




### జి.రంగన్న సిపిఐ పట్టణ కార్యదర్శి,,,,,

**ఎమ్మిగనూరు నంది పత్రిక సెప్టెంబర్ 22** ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ కారణంగా కర్నూలు జిల్లాలో సాగు చేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతు తీవ్రంగా నష్టపోయారని కాబట్టి తక్షణమే కర్నూలు జిల్లాను కరువు జిల్లా గా ప్రకటించి, నష్టపోయిన ప్రతి ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఈనెల 24, 25 తేదీలలో గ్రామ సచివాలయాల ముందు నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ కార్యదర్శి జి రంగన్న పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ సమీముల్లా తెలిపారు. మంగళవారం పట్టణంలోని కటిక పేటలో సిపిఐ నూతన శాఖ సమావేశాన్ని సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి సిపిఐ పట్టణ కార్యదర్శి జి రంగన్న పట్టణ సహాయ కార్యదర్శి సమీవుల ముఖ్యఅతులుగా పాల్గొని మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో సాగు చేసిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిని రైతుల తీవ్రంగా నష్టపోయారని ముఖ్యంగా పత్తి, వేరుశనగ, టమాట, కంది, ఉల్లి, మిరప, ఆముదం, తదితర పంటల రైతులకు ఎకరాకు 50 వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేశారని అయితే సరైన సమయానికి వర్షాలు పడక పంటలన్నీ పూర్తిగా దెబ్బతిని చేతికి రాని దుస్థితి నెలకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కౌలు రైతుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని నష్టపోయిన రైతుల ఖాతాలో తక్షణమే ఎకరాకు 50 వేల రూపాయలు నష్టపరిహారం జమ చేయాలని, రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటలు రుణాలను బెషరతుగా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పశువులకు ఉచితంగా మేత సరాఫరా చేయడంతో పాటు పంట బీమా పరిహారం కరువు పెన్షన్ రైతులు అందించాలని టమాటా వేరుశనగ పత్తి తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి తినసరి వేతనం రోజుకు 700 రూపాయలు ఇవ్వాలని పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంత పెద్ద ఎత్తున రైతాంగం నష్టపోతుంటే కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి ముహూర్తాలు చూస్తూ మీనామేషాలు లెక్కించడం దుర్మార్గమని కాబట్టి తక్షణమే

**కర్నూలు జిల్లాలో కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ** ఈనెల 24, 25 తేదీలలో గ్రామ సచివాలయాల ముందు సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం నూతన శాఖను ఎన్నుకోవడం జరిగింది.

శాఖ కార్యదర్శి నాభి సాహెబ్, గౌస్ పీరా, శాఖ సభ్యులు గా 20 మందిని ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు ఈ సమావేశంలో సిపిఐ నాయకులు కాజా, ఇస్మాయిల్, మాలిక్, నబిష, గౌస్ పీరా,షరీఫ్, ఆంజనేయ, కాజా, నబి సాబ్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు

# హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌తో పట్టణాల రూపురేఖల్లో సమూల మార్పు....








## భీమవరం పట్టణ అభివృద్ధికి రూ.43 కోట్లు.. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు రూ.210 కోట్లు

**భీమవరం బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 22 నంది పత్రిక** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచి పట్టణాల రూపురేఖలను మార్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కుప్పం నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని భీమవరంలోని ఆనంద్ ఇన్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు పాల్గొని వీక్షించారు. తొలుత జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 123 పట్టణ స్థానిక సంస్థల్లో సుమారు రూ.7,469 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. హెచ్ఏఎం విధానంలో పట్టణ స్థానిక సంస్థలపై ఆర్థిక భారం పడకుండా రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు మరియు వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి ఉపయోగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,165 కిలోమీటర్ల రోడ్లు, 502 పార్కులు, 210 కిలోమీటర్ల సెంట్రల్ మీడియన్లు, 391 కిలోమీటర్ల స్ట్రీట్ లైటింగ్, 300 కిలోమీటర్ల సీవరేజ్ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రోడ్ల నిర్మాణానికి రూ.4,656 కోట్లు, సెంట్రల్ మీడియన్లకు రూ.88 కోట్లు, స్ట్రీట్ లైటింగ్‌కు రూ.247 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.509 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.3,890 కోట్ల విలువైన పనులతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి మొత్తం రూ.11,359 కోట్ల విలువైన పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.

పశ్చిమగోదావరి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీల అభివృద్ధికి సుమారు రూ.210 కోట్లు మంజూరు కాగా, భీమవరం పట్టణానికి రూ.43 కోట్ల నిధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. మంజూరైన నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భీమవరం పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయడంతో పాటు సుందరీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఈ పనులను పూర్తి చేయాలని ఆమె అన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ విధానంలో పట్టణ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపడి ప్రజలకు సౌకర్యవంతమైన జీవన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. స్థానిక శాసనసభ్యులు పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ, పట్టణాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుప్పం నుంచి వర్చువల్‌గా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. భీమవరం పట్టణ అభివృద్ధికి రూ.43 కోట్లు మంజూరయ్యాయని, ఈ నిధులతో సెంట్రల్ లైటింగ్, రహదారుల విస్తరణ, పార్కుల అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు చేపడతామని తెలిపారు. పట్టణాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తయిన అనంతరం సుమారు రూ.100 కోట్ల అదనపు నిధులు వస్తాయని, వాటితో పట్టణ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ బలిజి కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు,ఏ ఎం సి చైర్మన్ కలిదిండి సుజాత, రాష్ట్ర ఆర్టీసీ విజయవాడ రీజియన్ మాజీ చైర్మన్ మెంటే పార్థసారథి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి భీమవరం మాజీ ఏఎంసీ చైర్మన్ కొళ్ళ నాగేశ్వరరావు, మైనారిటీ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ షబీనా బేగం, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ పామర్తి వెంకటరామయ్య తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.











# జాతీయ పోషణ మాసోత్సవం,,,,



**నందవరం నంది పత్రిక సెప్టెంబర్ 22** 9వ జాతీయ పోషణ మాసం సందర్భంగా ఎమ్మిగనూరు ఐసిడిఎస్ సిడిపిఓ సఫర్నిసా బేగం,సూపర్వైజర్ గుణశేఖరమ్మ ఆదేశాల మేరకు చిన్నారులు,గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతపై అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మిదేవి,జయంతి, లలిత లు అవగాహన కల్పించారు.పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని అంగన్వాడీ సిబ్బంది వివరించారు. చిన్నారులకు సమతుల ఆహారం అందించడం,పరిశుభ్రత పాటించడం,రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అనంతరం అంగన్వాడి సిబ్బంది,చిన్నారులు,తల్లులు తో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సహాయకులు,తల్లులు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆళ్లగడ్డ మున్సిపాలిటీ అభివృద్ధికి 21కోట్లు భారీ నిధులు మంజూరు



**ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 22 నంది పత్రిక** పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం వేసిన అతిపెద్ద అడుగులో భాగంగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం నాడు కుప్పం నుండి 'హైబ్రిడ్ యాన్యుటీ మోడల్' (హెచ్ ఏ ఎం) పథకాన్ని వర్చువల్ విధానంలో ప్రారంభించారు.ఈ మహా యజ్ఞంలో భాగంగా ఆళ్లగడ్డ మున్సిపాలిటీకి రూ.21 కోట్ల భారీ నిధులు మంజూరు కావడం ఎంతో ఆనందదాయకం. మన నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ఈ నిధులు కేటాయించిన సీఎం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆళ్లగడ్డ ప్రజల తరఫున నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ నిధులతో మన ఆళ్లగడ్డ పట్టణంలో నాణ్యమైన రహదారులు, మెరుగైన వీధి దీపాలు, ఆహ్లాదకరమైన పార్కులు వంటి మౌలిక వసతులు వేగంగా ఏర్పాటు చేయబడతాయి. ఇందుకు సంబంధించిన కార్యక్రమం ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించాం.ఆళ్లగడ్డను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు మన ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందన్నారు ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పి కిషోర్ మున్సిపల్ మేనేజర్ ఆనంద్ టిడిపి నాయకులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ హుస్సేన్ భాష, శేఖర్ రెడ్డి ,నాగిరెడ్డిపల్లి శేఖర్ రెడ్డి శ్రీనివాసరెడ్డి నాగాంజనేయులు, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# సెప్టెంబర్ 26న విజయవాడలో జాబ్ మేళా

## 14 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు 10వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు అర్హత

## జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

**విజయవాడ: బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 22, నంది పత్రిక** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 9:00 గంటలకు విజయవాడ కేబిన్ కాలేజ్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ జాబ్ మేళాలో సుమారు 14 ప్రముఖ కంపెనీలు పాల్గొని వివిధ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని తెలిపారు. జాబ్ మేళాలో పాల్గొనేందుకు 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు యువతీ యువకులు అర్హులని అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాన్ని బట్టి నెలకు రూ.12,000 నుంచి రూ.50,000 వరకు వేతనం, ఇతర సౌకర్యాలతో కూడిన ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఆసక్తి మరియు తగిన అర్హతలు కలిగిన అభ్యర్థులు ముందుగా ష్ట్రజూం:// ఖుఆజూబఅఖుఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు బయోడేటా, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్, పాన్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని తెలిపారు. జాబ్ మేళాకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 9700092606, 9700025833, 8712495530 సెల్ నంబర్ల నందు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు..



## 31 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం ,,,

### ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర్ రెడ్డి ,,,,,,



**ఎమ్మిగనూరు నంది పత్రిక సెప్టెంబర్ 22** రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (నూవీ) ప్రాజెక్టుల వర్చువల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ముందుగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ూదీ× సర్కిల్ నుంచి కుర్ణి కళ్యాణ మండపం వరకు ర్యాలీగా చేరుకున్న ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర్ రెడ్డి , అనంతరం సభా వేదికపై జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ₹11,360 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా ప్రారంభించగా అందులో భాగంగా ఎమ్మిగనూరు మున్సిపాలిటీ కి ₹31కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర్ రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మిగనూరు పట్టణంలో రోడ్ల అభివృద్ధి, మురుగు నీటి కాలువల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, తాగునీటి పైపులైన్ల మెరుగుదల మౌలిక వసతుల పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందిస్తూ, ఎమ్మిగనూరు పట్టణాన్ని ఆధునిక వసతులతో మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ బివి జయనాగేశ్వర్ రెడ్డిపేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, పట్టణ టీడీపీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు, వార్డు కమిటీ నాయకులు, మహిళలు, ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## గురువులపై దాడి సమాజం సిగ్గుపడేలా ఉంది

### గురువులపై గూండాగిరి చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం : గద్దె క్రాంతి కుమార్




**విజయవాడ బ్యూరో చీఫ్ సెప్టెంబర్ 22 నంది పత్రిక** పిల్లలకు విద్యాబుద్ధులు చెప్పి వారి భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ మంగళవారం నాడు తీవ్రంగా మండిపడ్డారు. విజయవాడలో స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయుల విషయంలో చోటుచేసుకున్న ఉద్రిక్తతలు, వారిపై దాడి చేయడానికి ప్రయత్నించడం బాధించాయని పేర్కొన్నారు. గురువులు ఎక్కడ కనిపించినా గౌరవంతో నమస్కరించే సంస్కృతి మనదని, అలాంటి గురువులపైనే దాడులకు దిగడం సభ్య సమాజం సిగ్గుపడే విషయం అన్నారు. ఉపాధ్యాయుల నియామకాలు, వారి సర్టిఫికెట్లపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులను ఆశ్రయించి ఆధారాలతో విచారణ కోరాలి తప్ప.. భౌతిక దాడులకు దిగడం, భయభ్రాంతులకు గురిచేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా వ్యవహరించారని, ఇప్పుడు కూడా వారిని రాజకీయ వివాదాల్లోకి లాగడం దురదృష్టకరమన్నారు. చదువు చెప్పాల్సిన గురువులను గతంలో వైన్స్ షాపుల వద్ద విధులకు వినియోగించిన విషయాన్ని ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఇప్పుడు ఉపాధ్యాయులపై జరిగిన ఘటనలను చూస్తుంటే రాజకీయ కక్షలు ఎంతటి స్థాయికి దిగజారాయో అర్థమవుతోందన్నారు. ఉపాధ్యాయులను అవమానించడం అంటే సమాజ భవిష్యత్తును అవమానించడమేనని క్రాంతి కుమార్ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులను, ముఖ్యంగా ఉపాధ్యాయులను రాజకీయ ప్రయోజనాల కోసం లక్ష్యంగా చేసుకోవడం మానుకోవాలని హితవు పలికారు. ఉపాధ్యాయుల గౌరవం, భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడదని, దాడులకు పాల్పడిన వారిని గుర్తించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని గద్దె క్రాంతి కుమార్ కోరారు. గురువులను గౌరవించడం మన సంస్కృతి అని కానీ ఆ సంస్కృతి వదిలి గురువులపై దాడి చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని ఆయన పేర్కొన్నారు.

## మా సూట్‌కేసులూ ఆయనే మోశారు: లోకేష్‌తో తొలి పరిచయంపై డాక్టర్ పిల్లి గురురాజా

రాజకీయ నాయకులంటే సాధారణంగా ప్రజల్లో ఒక అభిప్రాయం ఉంటుంది. ఆడంబరం, అధికార దర్పం ప్రదర్శిస్తారని చాలామంది భావిస్తుంటారు. సరిగ్గా ఇలాంటి ఆలోచనలతోనే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను తొలిసారి కలిసినప్పుడు ఆయనను పరీక్షించాలనుకున్నామని, కానీ ఆయన ప్రవర్తన చూసి ఆశ్చర్యపోయామని గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ నూతన అధ్యక్షుడు డాక్టర్ పిల్లి గురురాజా ఆసక్తికరమైన సంఘటనను పంచుకున్నారు. లోకేష్ వ్యక్తిత్వం, ఆయన నాయకత్వ లక్షణాలపై గురురాజా ఓ ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 2013లో తాను, రవి వేమూరు గారు కలిసి లోకేష్‌ను డాలస్‌లో తొలిసారి కలిసినప్పటి అనుభవాన్ని గురురాజా గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు ఎయిర్‌పోర్ట్‌లో లోకేష్‌ను కలిశాం. అప్పటికి మా మనసులో రాజకీయ నాయకులపై ఓ రకమైన అభిప్రాయం ఉంది. 'ఇప్పుడు లగేజీ వస్తుంది, మనల్ని సూట్‌కేసులు ఎత్తి కారులో పెట్టమంటే మాత్రం ఇదే ఆయనతో మన చివరి ప్రయాణం' అని ముందే అనుకున్నాం. కానీ, తీరా చూస్తే అందుకు పూర్తిగా భిన్నంగా జరిగింది. ఆయన మా సూట్‌కేసులను కూడా స్వయంగా తీసుకుని కారులో పెట్టారు. ఆ ఒక్క సంఘటనతో ఆయన ఎలాంటి వారో మాకు అర్థమైంది," అని గురురాజా వివరించారు.లోకేష్ ఆలోచనా విధానం కూడా ఆయన వ్యక్తిత్వానికి అద్దం పడుతుందని గురురాజా తెలిపారు. ""మీలాంటి చిన్న నీటి బిందువులతో తయారైనదే ఈ సముద్రం. నువ్వు వచ్చి ఇందులో కలిస్తే నువ్వూ సముద్రం అయిపోతావు' అని కార్యకర్తలతో చెప్పగల గొప్ప మనసు లోకేష్‌ది. కార్యకర్తలే పార్టీకి బలమని, నాయకులు వస్తుంటారు పోతుంటారు కానీ కార్యకర్తలే శాశ్వతమని ఆయన బలంగా నమ్ముతారు," అని పేర్కొన్నారు. నారా లోకేష్‌లో తన తాత, తండ్రి ఇద్దరి లక్షణాలు కలగలిసి ఉంటాయని గురురాజా అభివర్ణించారు. "నందమూరి తారకరామారావు గారి మాస్, నారా చంద్రబాబు నాయుడు గారి క్లాస్ రెండూ మిక్సీలో వేస్తే వచ్చిన వ్యక్తే నారా లోకేష్. ఆయనలో తాతగారి మొండి ధైర్యం, తండ్రిగారి దార్శనికత రెండూ ఉన్నాయి. యువగళం పాదయాత్ర సమయంలో ఆయన ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో చూశాం. మాట ఇస్తే, దానికి కట్టుబడి ఉంటారు. ఆ మాట నిలబెట్టుకోవడానికి దేవతలు అడ్డు వచ్చినా వెనక్కి తగ్గరనిపిస్తుంది" అంటూ లోకేష్‌పై తనకున్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆ రోజు తాము చూసిన వినయపూర్వకమైన వ్యక్తే, ఈ రోజు లక్షలాది మందిని నడిపించే నాయకుడిగా ఎదగడం గర్వంగా ఉందని గురురాజా అన్నారు.



# ముఖ్యమంత్రి చేతుల మీదుగా నందిగామ రూ. 19 కోట్ల పనులకు వర్చువల్ శంకుస్థాపన





**మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్ సీసీ రోడ్లన్నీ ఒకే టెండర్‌తో నూటికి నూరు శాతం పూర్తి**

**కూటమి ప్రభుత్వంలో నందిగామ మున్సిపాలిటీకి రూ. 147 కోట్లకు పైగా నిధులు**

**యూసీఎఫ్ మూడో దశ కింద రూ. 16 కోట్లతో పట్టణమంతటా శాశ్వత డ్రైనేజీ**

**నందిగామ ముఖచిత్రం మారుతోంది**

**ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధికి శ్రీకారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య**

**నందిగామ బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 22 నంది పత్రిక:**

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కుప్పం నుంచి రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో రూ. 11,360 కోట్ల అభివృద్ధి పనులకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అందులో భాగంగా నందిగామ మున్సిపాలిటీకి మంజూరైన రూ. 19 కోట్ల పనులకూ శ్రీకారం పడింది.పాత బస్టాండ్ వద్ద బాబు జగజ్జీవన్ రామ్ భవన్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరపై ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కిన క్షణంలో హాలులో నిండిన కూటమి నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ, "ఎన్నికల సమయంలో ప్రతి వీధిలో తిరిగినప్పుడు ప్రజలు చెప్పిన మొదటి బాధ 'అమ్మా, మా వీధి రోడ్డు చూడు.' నా పదవీకాలంలో ప్రతి రోడ్డునూ సీసీ రోడ్డుగా మారుస్తానని ఆ రోజు మాట ఇచ్చాను. ఐదేళ్లలో అన్నాను; రెండేళ్లలోనే కావాల్సిన నిధులు సాధించుకున్నాం" అని అన్నారు.నేటి రూ. 19 కోట్లతో నందిగామ మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లన్నీ ఒకే టెండర్‌తో, నూటికి నూరు శాతం పూర్తవుతాయని ఆమె వివరించారు. ఈ నిధులతో రూపుదిద్దుకోనున్న పనులు: సీసీ రోడ్లు: రూ. 11 కోట్లకు పైగా వ్యయంతో 15 కిలోమీటర్లకు పైగా ప్రధాన రహదారుల నుంచి మూడు మీటర్ల ఇరుకు సందుల వరకనూతన మున్సిపల్ భవనం: సుమారు రూ. 3 కోట్లతో, గ్రేడ్–1 హోదాకు తగిన కార్యాలయ పబ్లిక్ పార్క్: రైతుపేటలో గల గోవర్ధన్ గార్డెన్స్‌లో అర ఎకరంలో, కోటి రూపాయల పైచిలుకుతో, వాకింగ్ ట్రాక్‌తో డివైడర్, లైటింగ్: గాంధీ సెంటర్‌రామన్నపేట మార్గంలో ఒక భాగంలో సెంట్రల్ డివైడర్, సెంట్రల్ లైటింగ్ కూటమి ప్రభుత్వంలో నందిగామ మున్సిపాలిటీకి వివిధ పథకాల కింద రూ. 147 కోట్లకు పైగా నిధులు సమకూరాయని సౌమ్య వెల్లడించారు: కృష్ణా జలాలు (ఏఐఐబీ) రూ. 103.26 కోట్లు: ఇంటింటికీ తాగునీటి పథకం పనులు సాగుతున్నాయి హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ రూ. 19 కోట్లు: నేడు శ్రీకారం, టెండర్ దశ యూసీఎఫ్ మూడో దశ రూ. 16 కోట్లు: పట్టణంలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ మొత్తం కచ్చా కాలువల స్థానంలో శాశ్వత డ్రైనేజీ; పరిపాలనా అనుమతుల దశలో ఉంది, త్వరలో టెండర్లు 15వ ఆర్థిక సంఘం రూ. 5.40 కోట్లు: రూ. 3.40 కోట్లతో 32 పనులు టెండర్ దశలో; అదనంగా మంజూరైన రూ. 2 కోట్లకు పనుల ప్రతిపాదనలు తయారవుతున్నాయి స్వచ్ఛ భారత్ మిషన్ 2.0 రూ. 3.54 కోట్లు: ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ కేంద్రానికి పల్లగిరి సమీపంలో స్థలం కేటాయించారు; పనులు త్వరలో ప్రారంభం "రోడ్లలాగే డ్రైనేజీనీ ఒక్కసారిగా పూర్తి చేస్తాం. నందిగామకు శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ వస్తుంది" అని ఆమెస్పష్టించేశారు కేంద్రీయ విద్యాలయం తరగతులు మధిర రోడ్డులోని తాత్కాలిక భవనంలో ప్రారంభమయ్యాయని, శాశ్వత భవనానికి రాఘవాపురంలో ఐదెకరాల భూమి కేటాయించామని గుర్తు చేశారు. రూ. 34 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి ఆధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, హనుమంతుపాలెంలో రూ. 15 కోట్లతో 50 పడకల ఆయుష్ ఆసుపత్రి రాబోతోందని తెలిపారు."గతంలో శిలాఫలకాలు వేసి వదిలేసిన రోజులు చూశాం. ఈరోజు జరిగింది అలాంటి శంకుస్థాపన కాదు జీవో వచ్చింది, నిధులు మంజూరయ్యాయి, టెండర్లు ఖరారు దశలో ఉన్నాయి. ఇది నిధులతో కూడిన శ్రీకారం అని సౌమ్య పేర్కొన్నారు.మంజూరైన ప్రతి పనీ నాణ్యతతో, వేగంగా పూర్తయ్యేలా స్వయంగా పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారు. ఈ అభివృద్ధి వాస్తవాన్ని ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యత కూటమి నాయకులు, కార్యకర్తలదేనని పిలుపునిచ్చారు.నందిగామ అభివృద్ధికి అండగా నిలుస్తున్న ప్రధానమంత్రి శ్నరేంద్ర మోదీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ , మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు కార్యకర్తలు, పట్టణ ప్రజలు పపాల్గొన్నారు.

# రాహులే మోదీ విజయ రహస్యం!

పావు శతాబ్ది క్రితం నాటి మాట. 2001 అక్టోబర్ 1న న్యూఢిల్లీలో ఉన్న నరేంద్రమోదీ ఫోన్ మోగింది. 'ఎక్కడున్నారు?' అని అడిగిన ప్రశ్న విని మోదీ చకితులయ్యారు. ఎందుకంటే ఆ స్వరం ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయిది. 'శ్మశానంలో ఉన్నాను' అని మోదీ జవాబిచ్చారు. వాజపేయి దిగ్భ్రాంతి చెందారు. 'అక్కడేం చేస్తున్నారు?' అని అడిగారు. 'నిన్న విమాన ప్రమాదంలో మరణించిన కాంగ్రెస్ నేత మాధవరావు సింధియాతో పాటు నా మిత్రుడు, ఫొటో జర్నలిస్టు గోపాల్ భిస్త్ కూడా మరణించాడు. అతడి అంత్యక్రియలకు వచ్చాను' అని మోదీ చెప్పారు. 'సరే, సాయంత్రం రండి..' అని వాజపేయి ఫోన్ పెట్టేశారు. సాయంత్రం తనను కలిసిన మోదీని చూడగానే వాజపేయి నవ్వుతూ 'ఢిల్లీలో పంజాబీ తిండి బాగా ఒంటబట్టినట్లుంది. మీకిక్కడ ఏమీ పనిలేదు. గుజరాత్‌కు వెళ్లి అక్కడ పనిచేసుకోండి' అని చెప్పారు. వాజపేయి ఏమంటున్నారో మోదీకి మొదట అర్థం కాలేదు. అప్పటికే ఆయన ఆరేళ్లుగా ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా వివిధ రాష్ట్రాల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 'గుజరాత్‌లో ఏమి చేయాల్సి ఉంటుంది సార్' అని వాజపేయిని మోదీ అడిగారు. 'ఏం చేస్తారు? ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాలి' అని అటల్జీ అన్నారు. మోదీ ఉబ్బితబ్బిబ్బయ్యారు. తనకు అంత పెద్ద బాధ్యత అప్పగిస్తారని ఆయన ఊహించలేదు. 'నేను ఇంతవరకూ అసెంబ్లీ ముఖమే చూడలేదు. ముఖ్యమంత్రి కార్యాలయంలోకి అడుగు పెట్టలేదు. ఆరేళ్లుగా అక్కడేం జరుగుతున్నదో నాకు తెలియదు' అని మోదీ అన్నారు. 'నేను కూడా మొదటిసారి ఢిల్లీ వచ్చినప్పుడు నాకిక్కడ ఎవరూ తెలియదు' అని వాజపేయి చమత్కరించారు. మోదీ వెన్వెంటనే తనకు మార్గదర్శకుడైన లాల్‌కృష్ణ ఆడ్వాణీ ఇంటికి వెళ్లారు. 'అటల్జీ అంతా చెప్పారు కదా?' అని ఆయన అనేసరికి మోదీ ఆశ్చర్యపోయారు. తనను గుజరాత్ పంపాలన్న ఆలోచన వాజపేయి ఒక్కరిదే కాదని ఆయనకు అర్థమైంది. అప్పటి ఆరెస్సెస్, సర్ సంఘ్ చాలక్ సుదర్శన్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి మదన్‌దాస్ దేవి, సీనియర్ నేత దత్తోపంత్ థేంగ్డీలతో చర్చించిన తర్వాతే తాను, వాజపేయి కలిసి నిర్ణయం తీసుకున్నామని మోదీకి ఆడ్వాణీ చెప్పారు. ఆ తరువాత అశోకా రోడ్‌లోని బీజేపీ కార్యాలయానికి మోదీ వెళ్లారు. అక్కడ విలేఖర్లతో మాట్లాడుతూ 'నేను మళ్లీ గుజరాత్‌లో అడుగుపెడుతున్నాను' అని మందహాసంతో చెప్పారు. పత్రికా గోష్ఠిని ముగిస్తూ ప్రతి ఒక్కరితో కరచాలనం చేశారు. అప్పట్లో ఆయనకు విలేఖర్లతో మంచి సంబంధాలు ఉండేవి. విలేఖర్ల సమావేశంలో మాట్లాడేందుకు ఇతర నేతలతో పోటీపడేవారు. ఆ తర్వాత అంత హాయిగా ఆయన మాట్లాడడాన్ని నేనెప్పుడూ చూడలేదు. మోదీని ముఖ్యమంత్రిగా గుజరాత్ పంపాలని బీజేపీ అగ్రనేతలు నిర్ణయం తీసుకోవడానికి ముఖ్య కారణాలున్నాయి. గుజరాత్‌లో పార్టీ అగ్రనేతలు కేశుభాయి పటేల్, శంకర్‌సింగ్ వాఘేలాల మధ్య అంతర్గత చిచ్చు నేపథ్యంలో మోదీ 1995లో ఢిల్లీ రావాల్సి వచ్చింది. 1998 ఫిబ్రవరిలో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో గుజరాత్‌లో పార్టీని గెలిపించేందుకు ఆయన విశేష కృషి చేశారు. మోదీ ప్రాధాన్యాన్ని గుర్తించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు కుశాభావు ఠాక్రే ఆయనను గోవిందాచార్య, వెంకయ్యనాయుడు, సుమిత్రా మహాజన్‌లతో పాటు పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. 2000లో బంగారు లక్ష్మణ్ అధ్యక్షుడైన తర్వాత కూడా మోదీని తన టీమ్‌లో కొనసాగించారు. ఈ మధ్య కాలంలో గుజరాత్‌లో పార్టీ పరిస్థితి బాగా బలహీనపడింది. పటిష్ఠ పాలనసందించడంలో కేశుభాయి పటేల్ వైఫల్యం, తీవ్ర కరువు తాండవించడం, భుజ్‌లో భయానక భూకంపం సంభవించినప్పుడు ప్రభుత్వం సరైన సహాయక చర్యలు చేపట్టలేకపోవడంతో బీజేపీ ప్రతిష్ఠ తీవ్రంగా దిగజారింది. స్థానిక ఎన్నికల్లో పార్టీ ఘోరంగా దెబ్బతింది. మొత్తం 25 జిల్లా పంచాయతీల్లో 23 పంచాయతీలను బీజేపీ కోల్పోయింది. పట్టణ ప్రాంతాల్లో కూడా బీజేపీ పట్టు కోల్పోసాగింది. 2001 సెప్టెంబర్‌లో ఆడ్వాణీ ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సబర్మతితో సహా రెండు స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోయింది. గుజరాత్‌లో నాయకత్వ మార్పు జరగాల్సిందేనని పార్టీ పరిశీలకులు మదన్ లాల్ ఖురానా, కుశాభావు ఠాక్రే నివేదిక సమర్పించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే వాజపేయి, ఆడ్వాణీల నిర్ణయం మేరకు 2001 అక్టోబర్ 7న మోదీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. నరేంద్రమోదీ సుదీర్ఘకాలం ముఖ్యమంత్రి పదవిలో కొనసాగడమే కాకుండా ప్రధానమంత్రి అవుతారని, అధికారంలో పాతికేళ్ల ప్రస్థానం పూర్తి చేస్తారని వాజపేయి, ఆడ్వాణీలు ఆ రోజు బహుశా ఊహించి ఉండకపోవచ్చు. ఒక పదవిని సాధించడమే కాక, ఆ పదవిలో స్థిరపడి తిరుగులేని నాయకుడుగా ఎదగగలగడం వెనుక మోదీ విజయ రహస్యం ఏమిటి?మోదీ ముఖ్యమంత్రి అయిన వెంటనే తొలుత చేసిన పని పార్టీలో అంతర్గత కుమ్ములాటలను ఉక్కుపిడికిలితో అణచివేయడం తనకు వ్యతిరేకంగా ఉన్న సంజయ్ జోషిని గుజరాత్ నుంచే కాక పార్టీ నుంచి కూడా బయటకు పంపించడంలో మోదీ కృతకృత్యులు కాగలిగారు. సామ, దాన, భేద దండోపాయాలతో తనకు ఎదురు లేకుండా చేసుకుంటేనే మనుగడ సాధించగలమని ఆయన గ్రహించడమే అందుకు కారణం. చిన్నప్పుడు శాఖలో ఒక వ్యక్తి ఆదేశాలివ్వడం, అందరూ వాటిని క్రమశిక్షణతో పాటించడం మోదీ మనసుపై ప్రగాఢ ప్రభావం చూపింది. సంఘ్ పరివార్ వ్యవహారశైలే ఆయన డీఎన్ఏగా మారింది. నాయకుడన్న వ్యక్తి ఏది చెబితే అదే జరగాలని, రెండో అభిప్రాయానికి ఆస్కారం లేదని ఆయన పూర్తిగా విశ్వసించారు. తన చుట్టూ ఉన్నవారు తననే గమనించేలా, తన మాటే వినేలా చేయడం ఆయన తత్వంలో జీర్ణించుకుపోయిందని ఆయనపై రచనలు చేసిన అనేకమంది రచయితలు అభిప్రాయపడ్డారు. నరేంద్రమోదీ తన ప్రత్యర్థులను ఎప్పుడూ సహించరని, గుజరాత్‌లో ఆయన మంత్రివర్గంలో హోంశాఖ సహాయమంత్రిగా ఉన్న గోవర్ధన్ జడాఫియా వ్యాఖ్యానించారు. జడాఫియా మాత్రమే కాదు, మోదీకి గురువుగా ప్రసిద్ధుడైన కేశుభాయి పటేల్ కూడా తన శిష్యునికి వ్యతిరేకంగా వేర్వేరు పార్టీలు స్థాపించి తెరమరుగయ్యారు.గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తాను అనుసరించిన వైఖరినే ప్రధానమంత్రి అయ్యాక కూడా మోదీ అనుసరించారు. గుజరాత్ అల్లర్ల సమయంలో తనకు అండగా నిలిచి తన పదవి పోకుండా కాపాడి, మొత్తం పార్టీ మద్దతునిచ్చేలా చేసిన లాల్‌కృష్ణ ఆడ్వాణీ, తనను ఏకతా యాత్రలో వెంట తీసుకువెళ్లిన మురళీ మనోహర్ జోషిని ఆయన మార్గదర్శక మండలికి పంపించారు. అయితేనేం, మోదీ ప్రధాని అయినప్పటి నుంచీ గత పన్నెండు సంవత్సరాలుగా బీజేపీలో ఎలాంటి లుకలుకలు లేవు. మంత్రులు గానీ, పార్టీ సభ్యులు గానీ నాయకత్వానికి వ్యతిరేకంగా కిక్కురుమన్న సందర్భాలు లేవు. ఎవరిని కేంద్రమంత్రిగా నియమించినా ముఖ్యమంత్రిగా నియమించినా, చివరకు పార్టీ జాతీయ అధ్యక్షుడుగా ఎవరిని నియమించినా అడిగేవారు లేరు. ఒక పరిపాలకుడిగా బ్యూరోక్రాట్లతో చర్చించినట్లు మోదీ కనపడినా రాజకీయ కీకారణ్యంలో ఆయనే రారాజు. మోదీ చెప్పిందే వేదం. పార్టీ నేతలే కాదు, ఎన్డీఏలో ఒకప్పుడు మోదీని వ్యతిరేకించిన నేతలందరూ ఇవాళ ఆయన పుట్టిన రోజు వేడుకలు జరుపుతున్నారు. ఈ సందర్భంగా పోటీపడి మోదీని పొగడడం, దీపాలు వెలిగించడం చేస్తున్నారంటే రాజకీయాలపై ఆయన పట్టు బిగించిన తీరును అభినందించాల్సిందే. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని సైతం ఉపేక్షించిన నేతలు మోదీ జన్మదినాన్ని జరుపుకుంటున్నారంటే అది ఆయన నాయకత్వ విశిష్టత అని చెప్పక తప్పదు. ఇదివరకు నియంతృత్వ పాలకుల ఆధిపత్యానికి, నిఘాకు సంకేతంగా 'బిగ్ బ్రదర్ ఈజ్ వాచింగ్' అని హెచ్చరించేవారు. ఇప్పుడదే వ్యాఖ్య మోదీ విషయంలో వర్తిస్తుందని బీజేపీ, ఎన్డీఏ నాయకులందరికీ తెలుసు. ఎవరు దీపాలు వెలిగిస్తున్నారో, ఎవరు చప్పట్లు కొడుతున్నారో, ఎవరు తనను ఆకాశానికెత్తుతున్నారో మోదీకి తెలియకుండా ఉంటుందా? ఏమైతేనేం అధికారంలో పాతికేళ్లు పూర్తిచేసుకున్న పలువురు ప్రపంచ నేతల సరసన మోదీ కూడా చేరారు. తననే అందరూ గమనించేలా, తన గురించే అందరూ మాట్లాడేలా చేసుకోవడం. తనను విమర్శించినా, దూషించినా, తనను అవహేళన చేసినా తానే చర్చలో ప్రధాన కేంద్రం అయ్యేలా చూసుకోవడం మోదీ స్వభావం. ఇది ఆయన విజయ రహస్యంలో మరో కీలకాంశం. గుజరాత్ రోజుల నుంచీ ఆయన ఇదే శైలిని అవలంబిస్తున్నారు. వేషాలు మార్చినా, నాటకీయంగా వ్యవహరించినా, నవ్వినా, విదేశీ నేతలను హత్తుకున్నా అందరి దృష్టి తనపై పడేలా ఉద్దేశపూర్వకంగా చేయడమే మోదీ లక్ష్యం. దానివల్ల తన అభిమానులు, భక్తుల సంఖ్య ఏ మాత్రం తగ్గదని, పైగా తననెవరైనా విమర్శిస్తే వారు రెట్టింపు ఆగ్రహంతో దాడి చేస్తారని మోదీకి తెలుసు. తాను ఏమి చేసినా మైమరిచిపోయే, అంకితభావం గల భక్తులను పెద్ద సంఖ్యలో తయారు చేసుకోగలగడం మోదీ విజయానికి మరోకారణం. నెహ్రూ నుంచి వాజపేయి వరకూ ఏ నాయకుడికీ ఇలాంటి భక్తగణం లేనేలేదు. తన ఓటు బ్యాంకులో ప్రధానమైన హిందూత్వ వర్గాలను కోల్పోకుండా చూసుకున్నంతవరకూ తనకు నష్టం జరగదని మోదీ భావిస్తుండవచ్చు. జనసంఘ్, బీజేపీలో చిరకాలం పనిచేసిన ఒక పెద్దాయన ఇటీవల మోదీని కలిసి 'మీ విజయ రహస్యం ఏమిటో నాకు తెలుసు' అన్నారట. 'చెప్పుకోండి చూద్దాం' అని మోదీ అన్నారట. 'రాహుల్‌గాంధీ.!' అని ఆ పెద్దాయన ఇచ్చిన జవాబుకు మోదీ విరగబడి నవ్వారట! ఇటీవలి కాలంలో విద్యార్థుల మధ్య పెద్ద ఎత్తున తిరుగుతూ మోదీని అవహేళన చేస్తూ సంచలనం సృష్టిస్తున్న రాహుల్‌గాంధీ తనపై ఉన్న జనాభిప్రాయాన్ని మార్చివేయాలి.

# చమురు రంగంలో తెలుగు సంస్థలు

దేశ సరిహద్దులకు ఆవల ప్రపంచవ్యాప్తంగా భారత వాణిజ్య విజయం అంటే సహజంగా ఐటీ రంగ దిగ్గజ సంస్థలే గుర్తుకు వస్తాయి. ఈ సంస్థలు సకాలంలో మెరుగైన సేవలు అందించి లాభాలు ఆర్జిస్తున్నాయి; భారత యువజనులకు పెద్ద సంఖ్యలో ఉపాధి కల్పిస్తున్నాయి; మరీ ముఖ్యంగా భారతీయుల ప్రతిభా పాటవాలకు అంతర్జాతీయంగా ఎనలేని గుర్తింపును సాధిస్తున్నాయి. ఈ కారణంగానే సమకాలీన భారతీయ వాణిజ్య విజయాలకు ఐటీ సంస్థలు ప్రతీకలుగా వెలుగొందుతున్నాయి. ఇటీవల కొంతకాలంగా ఐటీ సంస్థలకు అదనంగా భారతీయ ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల సంస్థలూ విదేశాలలో విజయవంతంగా విస్తరిస్తున్నాయి. ఇది శుభ పరిణామం. ఇంజినీరింగ్, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రపంచంలో అగ్రభాగాన నిలిచే చమురు నిక్షేపాల నెలవులు అయిన గల్ఫ్ అరబ్బు దేశాలలో ఈ సంస్థలు వ్యూహాత్మక అడుగులు వేస్తున్నాయి. వాస్తవానికి భారతీయ ఇంజినీరింగ్, నిర్మాణ రంగ సంస్థలకు అరబ్బు దేశాలు కొత్త కాదు. చమురు ఎగుమతి ఆరంభ కాలం (1970వ దశకం)లో టాటా గ్రూప్ భాగస్వామి అయిన అగ్రగామి కాంట్రాక్టింగ్ కంపెనీ 'షాపుర్జీ పల్లోంజీ' గల్ఫ్ దేశాలలో సివిల్ నిర్మాణాలను విరివిగా చేపట్టింది. ఈ ఎడారి దేశాలలో మట్టి సరిగ్గా అందుబాటులో ఉండదు. దీంతో అవసరమైన మట్టిని షాపుర్జీ పల్లోంజీ కంపెనీ భారతదేశం నుంచి నౌకలలో తీసుకువచ్చేది. అప్పుడే ఆ కంపెనీ యువ ఇంజినీరు ఎ.పి.జితేందర్ రెడ్డిని కూడా ఉద్యోగ వీసాపై గల్ఫ్‌కు తీసుకువచ్చింది. సుదీర్ఘకాలం అరబ్బు దేశాలలో ఉన్న జితేందర్ దేశానికి తిరిగి వెళ్లి పార్లమెంటుకు పోటీ చేసి ఎన్నికయ్యారు. ఎలక్ట్రోమెకానికల్ రంగంలో ప్రముఖ భారతీయ సంస్థ 'ఎల్ అండ్ టీ' పూర్తి చేసిన 65 బిలియన్ డాలర్ల విలువైన పనులలో దాదాపు సగం సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్ దేశాలకు చెందినవే కావడం విశేషం. ఎడారి ఉష్ణోగ్రతలో ఎయిర్ కండిషన్ ఇంజినీరింగ్ భారీ కాంట్రాక్టులను ప్రపంచ దిగ్గజ బహుళజాతి సంస్థలతో పోటీపడి ఎల్ అండ్ టీ విజయవంతంగా పూర్తిచేసింది. మారుమూల ఇసుక ఎడారుల గుండా హై వోల్టేజీ విద్యుత్ లైన్ల నిర్మాణంలో కూడా ఎల్ అండ్ టీ తన విశిష్టతను చాటింది. గల్ఫ్ దేశాలలో పైపులైను వ్యవస్థ అత్యంత కీలకమైనది. నీటి వనరులు లేని ఈ ఎడారి దేశాలలో వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరం నుంచి శుద్ధి చేసిన ఉప్పు నీటిని నగరాలకు సరఫరా చేయడం, చమురును నౌకాశ్రయాల వరకు రవాణా చేయడానికి పైపులు ప్రధాన ఆధారాలు. ఈ పైపుల నిర్మాణం, సరఫరా పనుల్లో భారతీయ సంస్థలే ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. చమురు పైపుల నిర్మాణం, నిర్వహణలో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన నిపుణులు పెట్టింది పేరు. గల్ఫ్ దేశాలు అంటే చమురు, గ్యాస్‌కు మారుపేరు. ఈ దేశాలలో ప్రతి వ్యవస్థ ఈ రంగంతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా అనుసంధానమై ఉంటుంది. నిరంతర విస్తరణ, నిర్వహణ పనులు ఉండే ఈ రంగంలో ఇప్పటి వరకు భారతీయ సంస్థలు ఏవీ కూడా పోటీపడలేదు. సాధారణంగా అమెరికా, జర్మనీ, బ్రిటన్ దేశాల ఇంజినీరింగ్ సంస్థలే ఇందులో సదా అగ్రగాములుగా ఉంటాయి. ప్రప్రథమంగా భారతీయ సంస్థలు అందునా తెలుగు రాష్ట్రాలకు చెందిన సంస్థలు చమురు రంగంలో సాహసోపేతంగా అడుగుపెడుతున్నాయి. చమురు ఉత్పాదకతలో విడుదలయ్యే వివిధ రసాయనాలను వేరు చేస్తూ నికర చమురును తీయడం ఒక ముఖ్య ప్రక్రియ. ఇందుకు అవసరమైన ప్లాంట్లను సాధారణంగా పాశ్చాత్య దేశాల సంస్థలు మాత్రమే నిర్మిస్తాయి. ఈ రకమైన నిర్మాణ పనుల కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజినీరింగ్ సంస్థ కువైత్‌లో దక్కించుకుని ప్రపంచ ఇంజినీరింగ్ సంస్థలను ఆశ్చర్యానికి గురిచేసింది. 381 మిలియన్ డాలర్ల ఈ కాంట్రాక్టు చమురు రంగంలో భారతీయ సంస్థల ప్రాబల్యానికి ఒక తిరుగులేని నిదర్శనం. ఇంతకు ముందూ కువైత్ చమురు సంస్థ నొకదానిలో 225 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును మేఘా సంస్థే దక్కించుకుంది. సౌదీలో 300 కిలోమీటర్ల పైపు లైను ద్వారా మక్కా పుణ్యక్షేత్రానికి ఐదు లక్షల క్యూసెక్కుల మంచి నీరు సరఫరా చేసే అర్హత పొందిన సంస్థల జాబితాలో కూడా మేఘా ఉన్నది. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రోగ్రెసివ్, రాంకీ, జి.యం.ఆర్ సంస్థలు గతంలో వివిధ రంగాలలో కొన్ని పనులు చేసినా కీలకమైన చమురు రంగంలో మేఘా ప్రవేశమే భారతీయ కంపెనీలకు ఒక కొత్త ప్రారంభమని చెప్పవచ్చు. భారత వాణిజ్య విజయాలలో ఇదొక ఉజ్వల అధ్యాయం. ప్రపంచ వ్యాప్తంగా హైదరాబాద్ ఐటీ సంస్థల జైత్రయాత్రను ఇంజినీరింగ్ సంస్థలూ కొనసాగించాలి.

# వ్యక్తి పూజతో పాతాళంలోకే..!

ప్రజలు తమకు నచ్చిన హీరో, హీరోయిన్లను అభిమానించడం, మొదటి ఆట సినిమా కోసం ఎగబడి ప్రాణాలు కూడా కోల్పోవడం వివిధ సందర్భాలలో చూశాం. అది ఒక రకమైన వ్యక్తి పూజ. రాజకీయాలలో కూడా నాయకులను దేవుళ్లుగా చూడడం, ఇంకా పిచ్చి ముదిరి గుడులు కట్టించిన వార్తలు కూడా వచ్చాయి. సినీ నటులను పూజిస్తే అది వారి వ్యక్తిగతం. కానీ, రాజకీయ నాయకుల విషయం వేరు. వీరు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా దేశ భవిష్యత్తుపై పెద్ద ప్రభావమే కలిగిస్తారు. వ్యక్తి పూజ ఎక్కువైతే, అది క్రమంగా నిరంకుశత్వంగా మారి, దేశాన్ని అంధకారంలోకి నెట్టేయడమే కాక, అంతిమంగా ఆ నాయకుణ్ణి కూడా పాతాళంలోకి నెట్టేస్తుంది. అందుకు హిట్లర్, ముస్సోలినీ వంటి నాయకులే ఉదాహరణ. మన దేశంలో 'ఇండియాయే ఇందిరఇందిరే ఇండియా' వంటి వ్యక్తి పూజ చివరకు ఎమర్జెన్సీకి దారితీసి, ప్రజాస్వామ్య హక్కులను కాలరాసింది. అవి దేశంలో చీకటి రోజులుగా నిలిచాయి. అంతిమంగా అది వారి పార్టీకీ నష్టం కలుగజేసి, అర్ధ శతాబ్దం అయినా నేటికీ వారిని వెంటాడుతూనే ఉంది. నేడు మరలా అలాంటి లేదా అంతకంటే ప్రమాదకరమైన పరిస్థితులు దేశంలో ఏర్పడుతున్నాయి. ఈ సందర్భంగా ఈ వ్యక్తి పూజ ప్రమాదాన్ని గురించి ఆధునిక భారత నిర్మాతలు ఏమన్నారో గుర్తు చేసుకోవడం సందర్భోచితం.గణతంత్ర ఆవిర్భావ సమయాన బి.ఆర్.అంబేద్కర్ 1949 నవంబర్ 25న రాజ్యాంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ, భారత రాజకీయ ఆలోచనలో అత్యంత లోతైన హెచ్చరికలలో ఒకదాన్ని చేశారు: 'మతంలో భక్తి ఆత్మ మోక్షానికి మార్గం కావచ్చు. కానీ రాజకీయాల్లో భక్తి లేదా వ్యక్తి పూజ కచ్చితంగా పతనానికి, ఆ తర్వాత నిరంకుశత్వానికి దారితీసే మార్గం.' మన ఆధ్యాత్మిక సంప్రదాయాలలో భక్తికి పవిత్రమైన స్థానం ఉంది. కానీ రాజకీయం వేరని అంబేద్కర్ స్పష్టం చేశారు.సంప్రదాయ రూపంలో ఉండే నిరంకుశత్వం కంటే, ప్రజాస్వామ్య సంస్కృతి నెమ్మదిగా క్షీణించడం గురించే అంబేద్కర్ ఎక్కువగా భయపడ్డారు. రాజ్యాంగాలను రూపొందించవచ్చు, ఎన్నికలు నిర్వహించవచ్చు. కానీ గణతంత్రాలు అంతిమంగా ప్రజల ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటాయి. కఠినమైన ప్రశ్నలను అడగడానికి, అధికారం ఒకేచోట కేంద్రీకృతం కావడాన్ని అనుమానించడానికి, దేశం పట్ల భక్తికి, నాయకుడి పట్ల విధేయతకు మధ్య ఉన్న తేడాను గుర్తించడానికి సిద్ధంగా ఉన్న పౌరులపైనే అవి ఆధారపడతాయి. దీనికి పన్నెండేళ్ల ముందు అంటే 1937లో దేశం ఒకవైపు పరాయి పాలన, మరోవైపు అనిశ్చితమైన స్వాతంత్ర్య హామీల మధ్య ఊగిసలాడుతున్న సమయంలో, 'మోడరన్ రివ్యూ' పత్రికలో 'రాష్ట్రపతి' అనే శీర్షికతో ఒక వ్యాసం ప్రచురితమైంది. అందులో 'ఒక దయాగుణం ఉన్న, సమర్థుడైన నిరంకుశ పాలకుడి కింద దేశం కొంతకాలం పురోగమించినప్పటికీ, అది కుంగిపోతుంది, దాని వల్ల ప్రజల విముక్తి రోజు ఆలస్యమవుతుంది' అని రాశారు. ఆ వ్యాసం చివర 'చాణక్య' అని సంతకం చేసి ఉంది. ఆ రచయిత జవహర్‌లాల్ నెహ్రూ అని అప్పటి పాఠకులకు తెలియదు. ఆధునిక చరిత్రలో అత్యంత విచిత్రమైన ఆత్మపరిశీలనలలో ఇది ఒకటి. ఒక నాయకుడి సొంత ప్రజాదరణ దేశానికి ఎంత ప్రమాదకరమో గుప్తంగా రాశారు. నెహ్రూ అప్పటికే కోట్ల మంది ప్రజలకు, భారత ఆశయాలకు ప్రతీకగా, స్వాతంత్ర్య కాంక్షకు నిలువెత్తు రూపంగా కనిపించారు. ఆయనపై ఉన్న అభిమానం హద్దులు కూడా దాటింది. ఆ హద్దులు దాటడాన్నే ప్రమాదంగా పరిణమిస్తుందని ఆయన హెచ్చరించారు. సమాజం తన ఆశలను, భయాలను ఒక రక్షకుడిగా భావించే వ్యక్తిపై ఉంచుతుంది. కానీ నాయకులను పూజించే వస్తువులుగా మార్చినప్పుడు ప్రజాస్వామ్యం అరుదుగా మాత్రమే మనుగడ సాగిస్తుంది. ఒకే ఒక్క వ్యక్తిలో విముక్తిని వెతుక్కోవడానికి అలవాటుపడిన ప్రజలు, గణతంత్ర జీవితాన్ని నిలబెట్టే అలవాట్లను అంటే సంశయాత్మకత, చర్చ, భాగస్వామ్యం, బాధ్యతలను కోల్పోతారు. ఎంత ప్రతిభావంతుడైన వ్యక్తయినా సమాజం పట్ల ఉన్న బాధ్యతలకు అతీతుడు కాడు. నెహ్రూ, అంబేద్కర్ తమ సొంత రీతిలో భారతదేశానికి నేర్పడానికి ప్రయత్నించిన పాఠం కూడా ఇదే. వ్యక్తుల కంటే వ్యవస్థలే ముఖ్యమని, అధికారం తన కంటే పెద్దదైన దానికి జవాబుదారీగా ఉండాలనేది గణతంత్ర భావం. ప్రజాస్వామ్యాలకు మార్గదర్శకులు కావాలి, కానీ వారితో పాటు సద్విమర్శకులు కూడా తప్పనిసరిగా కావాలి. వ్యక్తి పూజా సంస్కృతిలోని విషాదం ఏంటంటే, అది మన సొంత ఆలోచనా శక్తిని ఇతరులకు కుదువబెట్టేలా చేస్తుంది. కేవలం ఒక వ్యక్తిపై ఉన్న అభిమానాన్ని దేశభక్తిగా పొరబడేలా చేస్తుంది. చరిత్ర అనేది కోట్ల మంది ప్రజల శ్రమ ద్వారా కాకుండా, కేవలం అసాధారణ కథానాయకుల ద్వారానే

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com